# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

అమరావతి
శనివారం
05-10-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 284
పేజీలు : 8

Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa | Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam




## ప్రజలందరూ ఏకమవ్వాలి

నేటి సంక్షోభిత ప్రపంచంలో శాంతి స్థాపన ఎంతో అవసరం

ప్రతిఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటాలి

బ్రహ్మకుమారీల సదస్సులో రాష్ట్రపతి ముర్ము 7



7

## 140 కోట్ల మంది విశ్వాసమే మన బలం

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

భౌగోళిక అనిశ్చితుల వేళ.. మనమే స్వీట్ స్పాట్: ప్రధాని



## నేడు హర్యానా పోలింగ్..

లోక్‌సభ ఎన్నికల తర్వాత రసవత్తర పోరు

**చండీగఢ్, అక్టోబర్ 4 :** దేశంలో నేడు మరో రసవత్తర పోరుకు హర్యానా రాష్ట్రం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో దేశ ప్రజల చూపు హర్యానాపై ఫోకస్ మళ్లింది. ఇక్కడ కాంగ్రెస్–బీజేపీ మిగతా 7లో...

# లడ్డూ కల్తీపై స్వతంత్ర సిట్

కల్తీ నెయ్యిపై దర్యాప్తునకు ఐదుగురితో సిట్

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయండి

సీబీఐ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరేసి పోలీసు అధికారులు


ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఓ సీనియర్ అధికారి

సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలి

సుప్రీంకోర్టు ఆదేశం



**ఢిల్లీ/అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు నమోదైన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఇందులో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర పోలీసుల నుంచి ఇద్దరు, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నుంచి ఒక సీనియర్ అధికారిని నియమించాలని ఆదేశించింది. సీబీఐ అధికారుల పేర్లను ఆ సంస్థ డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పేర్లను ఏపీ ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి పేరును ఆ సంస్థ ఛైర్పర్సన్ ప్రతిపాదించాలని నిర్దేశించింది. ఈ బృంద దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలని ఆదేశించింది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీ కోసం – మిగతా 2లో...



## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన చంద్రబాబు

ఈ తీర్పు సత్యం, న్యాయాన్ని సమర్థించడంలో కీలకమైన అడుగు

అన్ని పక్షాల సమర్థనంతో దర్యాప్తు జరగాలి



# దద్దరిల్లిన దండకారణ్యం

అంబూజ్ మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

36 మంది మావోయిస్టులు మృతి

14 మృతదేహాలు, ఏకే 47, ఎస్ఎల్ఆర్ తుపాకుల స్వాధీనం

రంగంలోకి డీఆర్జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ 1,200 మందితో ఆపరేషన్..

మావోయిస్టు చరిత్రలో భారీ ఎన్ కౌంటర్

వివరాలు 7లో..

## భారత్‌కు మాల్దీవుల అధ్యక్షుడు

6 నుంచి 10 వరకు 5 రోజులు ముయిజ్జు పర్యటన

ఇరు దేశాల సంబంధాలపై చర్చ




# రాష్ట్రంలో ఐదు గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు

తిరుపతి, అమరావతి, విశాఖ, మరో రెండుచోట్ల ఏర్పాటు

ఎంఎస్ఎంఈ పాలసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్తను తయారుచేద్దాం

చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహంపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, అక్టోబరు 4 (మనం న్యూస్) :** చిన్న పరిశ్రమల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ఐదు గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతి, అమరావతి, విశాఖ పట్నంతో పాటు మరో రెండుచోట్ల వీటి ఏర్పాటుకు ప్రతిపాదించింది. స్థానికంగా ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఒక మైక్రో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా 175 నియోజకవర్గాల్లో లక్షా 75వేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మైక్రో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పరిశ్రమల – మిగతా 2లో...

# మహిళలకు దసరా కానుక



ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం అడుగులు

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం

10న చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం!

**అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్):** టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీ ప్రజలకు దసరా కానుకను ఇస్తుందా అంటే భారీగానే అని ప్రచారం సాగుతోంది. ఈ నెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. అందులో ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అయినా – మిగతా 2లో...

# బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

ధ్వజారోహణంతో నాంది పలికిన అర్చకులు

తొలిరోజు పెద్దశేష వాహనంపై మలయప్ప విహారం

స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు

2025 టీటీడీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన చంద్రబాబు



**తిరుమల, అక్టోబరు 4 (మనం న్యూస్) :** తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వైభవంగా నాంది పలికారు. తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకుముందు ఆలయంలో నిత్యపూజాదికాల అనంతరం ప్రధాన అర్చకులు వరుసగా శ్రీదేవి, భూదేవి, మలయప్ప, ఇతర దేవతలు, కంకణ భట్టాచార్యులైన గోవిందా చార్యులు, టీటీడీ ఈవో శ్యామలరావుకు కంకణ ధారణ చేశారు. మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి, భూదేవి – మిగతా 2లో...

# బాబుకు భయం లేదు.. భక్తి లేదు



బాబు చెప్పినవి అన్నీ అబద్దాలే..

సిబిఐ విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నా

చంద్రబాబుకు సుప్రీంలో ఎదురుదెబ్బ తగిలింది

సుప్రీం ఆదేశాలపై జగన్ విమర్శలు

వివరాలు 2లో..

# పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి



అధికారం వచ్చిన తర్వాత పవన్‌లో మార్పులు : వైఎస్ షర్మిల

**అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఏఐసీసీ అగ్రనేత హుల్ గాంధీపై విమర్శలు చేయడం పెద్ద జోక్ అని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎంగా అన్నివర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శుక్రవారం షర్మిల మీడియా సమావేశం – మిగతా 2లో...

# లడ్డూ కల్తీపై స్వతంత్ర సిట్

మొదటి పేజీతరువాయి...

సరఫరా చేసిన నెయ్యిలో జంతుకొవ్వు కలిసిందని గుజరాత్లోని నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలోని కాఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో దానిపై తదుపరి విచారణ జరపడానికి ఏపీ ప్రభుత్వం సిట్ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని పక్కనపెట్టి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలోనో, హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోనో ఈ రంగంలోని ఇతర నిపుణులతో కలిపి స్వతంత్ర దర్యాప్తు జరిపించాలంటూ వైకాపా ఎంపీ, తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ ఖండేరావు చవ్హాంకే, బెంగళూరుకు చెందిన డాక్టర్ విక్రమ్ సంపత్, దుష్యంత్ శ్రీధర్ అనే వ్యక్తులు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 'ఒకే సరఫరాదారు నుంచి జులై 6న వచ్చిన రెండు ట్యాంకర్లు, 12న వచ్చిన రెండు ట్యాంకర్ల నెయ్యి కల్తీ అయినట్లు ఎఫ్ఐఆర్ నమోదైంది. కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించారని అందులో ఉన్న ఆరోపణ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీసే వీలుంది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు కొనసాగించాలా లేదా స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలా అన్నదానిపై కేంద్ర ప్రభుత్వ సలహాలు, సూచనలు తెలుసుకొని చెప్పాలని గత విచారణ సమయంలో సొలిసిటర్ జనరల్ను కోరాం. ఆ సిట్లోని అధికారులంతా మంచి ప్రతిష్ఠ ఉన్నవారేనని తెలిసిందని, అందువల్ల దానితో దర్యాప్తు కొనసాగిస్తే సమస్యేమీ ఉండదని ఆయన చెప్పారు. సిట్లోని సభ్యులకంటే సీనియర్ అయిన కేంద్ర ప్రభుత్వ అధికారి ఆ దర్యాప్తును పర్యవేక్షించేలా కోర్టు ఆదేశించవచ్చని ఆయన సూచించారు. మేం ఇప్పుడు వాద, ప్రతివాదులు చేస్తున్న ఆరోపణలు, అనుసరిస్తున్న వైఖరి లోతుల్లోకి వెళ్లడం లేదు. కోర్టును రాజకీయ యుద్ధక్షేత్రంగా ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని స్పష్టం చేస్తున్నాం. అయితే కోట్ల మంది మనోభావాలకు ఉపశమనం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు, సీబీఐ, ఎఫ్ఎస్ఎస్ఐఏ ప్రతినిధులతో కూడిన స్వతంత్ర సిట్ ద్వారా దర్యాప్తు జరిపించాలని నిర్ణయించాం. దాన్ని సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో కొనసాగించడం సముచితమని భావిస్తున్నాం. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా పెండింగ్లో ఉన్న అన్ని పిటిషన్లపై విచారణ ముగిస్తున్నాం. అయితే ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ అధికారుల స్వతంత్రత, నిష్పాక్షికతపై వ్యక్తం చేసిన అభిప్రాయంగా భావించకూడదని స్పష్టం చేస్తున్నాం' అని పేర్కొంది. తితిదే తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ.. ఇదివరకు తితిదే ఈఓ చేసిన ప్రకటనలనూ పత్రికల్లో తప్పుగా ప్రచురించారన్నారు.

## సిట్లో ఎవర్ని నియమించుకున్నా అభ్యంతరం లేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ 'మేం సిట్ కొనసాగాలని కోరుకుంటున్నాం. సుప్రీంకోర్టు/ కేంద్ర ప్రభుత్వం సూచించిన అధికారులనెవరినైనా అందులో సభ్యులుగా నియమించడానికి మాకు అభ్యంతరం లేదు. ఒక ప్రభుత్వంగా మేం భక్తుల మనోభావాల దృష్ట్యా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సిట్ ఏర్పాటు చేశాం. ఆ విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోండి. అంతే తప్ప పత్రికల్లో వచ్చిన ప్రకటనలను పరిగణనలోకి తీసుకోవద్దు' అని కోరారు. తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ లడ్డూ కల్తీ విషయంలో ప్రకటన చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన సిట్ ఆధ్వర్యంలో కాకుండా స్వతంత్రంగా దర్యాప్తు జరిపించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన చేయకపోయి ఉంటే వేరే విషయమని, ఇక్కడ ప్రకటన చేసినందున స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.

## ముఖ్యమంత్రి దీని గురించి ప్రత్యేకంగా చెప్పలేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది రోహత్గీ జోక్యం చేసుకుంటూ ముఖ్యమంత్రి దీని గురించి ప్రత్యేకంగా మాట్లాడలేదన్నారు. 'తమ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఈ అంశం కేవలం నాలుగు లైన్లు మాత్రమే ఉంది. అదీకాక ఆ నివేదిక జులైలో వస్తే.. సీఎం సెప్టెంబరులో మాట్లాడారు. అంటే నివేదిక రాకముందే ఆయన మాట్లాడారన్న ఆరోపణల్లో నిజం లేదు. ఏ ఆధారం లేకుండానే సీఎం తుది నిర్ణయానికి వచ్చి మాట్లాడినట్లు పత్రికల్లో చూపెట్టారు' అని వివరించారు. సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ ఈ నెయ్యిని అసలైన తయారీదారు సరఫరా చేయలేదని సర్వీస్ ట్యాక్స్ నివేదికల ద్వారా తెలిసిందన్నారు. సుబ్రహ్మణ్యస్వామి, వైవీ సుబ్బారెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్లు ఒకేలా, ఒకే తరహా తప్పులతో ఉన్నాయన్నారు.

## ఆ విషయాన్ని సుబ్బారెడ్డి దాచిపెట్టారు

తితిదే ఛైర్మన్గా పనిచేసిన సుబ్బారెడ్డి ప్రస్తుతం విజిలెన్స్ విచారణను ఎదుర్కొంటున్నారని సిద్ధార్థ లూథ్రా చెప్పారు. దానికి వ్యతిరేకంగా సుబ్బారెడ్డి హైకోర్టులో రిట్ దాఖలు చేశారన్నారు. ఆ విషయాన్ని ప్రస్తుత పిల్లో చెప్పకుండా దాచిపెట్టారని కోర్టుకు తెలిపారు.

## ఆరోపణలు కాదు.. ఆధారాలున్నాయి

కల్తీ నెయ్యి విషయంలో జరిగిన పరిణామాలు, ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలు, అందులో తేలిన విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని రోహత్గీ చెప్పారు. ఇది కచ్చితంగా దర్యాప్తు జరిపి తీరాల్సిన అంశమన్నారు. 'ఆరోపణల్లోని అంశాలు చాలా గంభీరమైనవన్న విషయంలో అనుమానమే లేదు. అయితే దానికి నిర్దిష్టమైన ఆధారం ఉందా' అని జస్టిస్ గవాయి ప్రశ్నించారు 'అన్నింటికీ కచ్చితమైన ఆధారాలు ఉన్నాయి. ఇందులో జంతు కొవ్వు ఉపయోగించారు. సిట్ అన్ని విషయాలనూ వెలికితీస్తుంది' రోహత్గీ సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా గ్యాగ్ ఆర్డర్ లేదని, వాళ్లు కూడా రాజకీయ నాయకులే కాబట్టి మాట్లాడుతారన్నారు. ఎన్డీడీబీ జులై 16న ఇచ్చిన నివేదికలో జంతుకొవ్వు ఉన్నట్లు స్పష్టంగా చెప్పిందన్నారు. కపిల్ సిబల్ బదులిస్తూ అది వృక్షసంబంధ కొవ్వు పదార్థం (వెజిటబుల్ ఫ్యాట్) తప్ప జంతు కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కాదన్నారు. అంతకు ముందు కూడా వెజిటబుల్ ఫ్యాట్ కనిపించిందన్నారు. ఆ వ్యాఖ్యలను రోహత్గీ తోసిపుచ్చారు. తమకు సమయమిస్తే ఆ అంశాలన్నింటికీ సమాధానాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు.

## కొండపైకి కల్తీ వస్తువులు రాకూడదు..!

జులై 6, 12 తేదీల్లో వచ్చిన నెయ్యిని వాడలేదని ప్రస్తుత తితిదే ఈఓ చెప్పారుగా అని జస్టిస్ కేవీ విశ్వనాథన్ ప్రశ్నించారు. సిద్ధార్థ లూథ్రా బదులిస్తూ 'కొండపై ఉన్న ఆలయం అత్యంత పవిత్రమైంది. కల్తీ వస్తువేదీ అక్కడికి రాకూడదు. ఈ ట్యాంకర్లు కొండపైకి వెళ్లిన తర్వాత అక్కడ పరీక్షించారు. అది పవిత్రతను దెబ్బతీయడం కాదా' అని పేర్కొన్నారు. జులై 6, 12 తేదీల్లో వచ్చిన నెయ్యిని ఉపయోగించలేదని మీరే చెప్పారుగా అని జస్టిస్ విశ్వనాథన్ మరోసారి ప్రశ్నించారు. జులై 4 వరకు వచ్చిన ట్యాంకర్లను పరీక్షించలేదని.. 6, 12 తేదీల్లో వచ్చిన ట్యాంకర్లలో కల్తీ నెయ్యి ఉందని లూథ్రా చెప్పారు. మరి వాటిని ఎందుకు అనుమతించారని కపిల్ సిబల్ ప్రశ్నించగా.. వాటికి డిసెంబర్లో మీరే కాంట్రాక్ట్ ఇచ్చారని లూథ్రా బదులిచ్చారు. కొండపైకి ఎందుకు అనుమతిచ్చారని సిబల్ మరో ప్రశ్న లేవనెత్తారు. జస్టిస్ గవాయి స్పందిస్తూ పరీక్షలు కొండపై మాత్రమే చేస్తారు కదా.. అని వ్యాఖ్యానించారు.

## భక్తుల మనోభావాల దృష్ట్యా స్వతంత్ర దర్యాప్తు

అనంతరం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిస్తూ ఇక్కడ రాజకీయాంశాలను కాకుండా కోట్ల మంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని దర్యాప్తు జరిపించాలన్నారు. జస్టిస్ గవాయి స్పందిస్తూ 'స్వతంత్ర దర్యాప్తు జరగనివ్వండి. అందులో సీబీఐ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు చొప్పున, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకర్ని సిట్లో ఉండనివ్వండి. ఈ కేసును ఇక్కడే పెండింగ్లో ఉండనివ్వండి... లేదంటే సీబీఐని పర్యవేక్షించనివ్వండి' అని పేర్కొన్నారు. దీనికి తుషార్ మెహతాతోపాటు అందరూ ఆమోదం తెలిపారు. ఈ కేసులో కపిల్ సిబల్ కక్షిదారు (వైవీ సుబ్బారెడ్డి) నిందితుడయ్యే వీలుందని తుషార్ మెహతా అనడంతో.. మీరే (సీబీఐ) ఎందుకు దర్యాప్తు చేయకూడదని జస్టిస్ విశ్వనాథన్ ఆయన్ను ప్రశ్నించారు. కచ్చితంగా భాగస్వాములమవుతామని మెహతా బదులిచ్చారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన చంద్రబాబు

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై స్వతంత్ర బృందంతో విచారణకు సుప్రీంకోర్టు తీసుకున్న కీలక నిర్ణయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు స్వాగతించారు. ఇద్దరు సీబీఐ, ఇద్దరు రాష్ట్ర పోలీసు అధికారులు, ఒక ఫుడ్ సేఫ్టీ అధికారితో సిట్ ఏర్పాటు చే యాలని తీసుకున్న నిర్ణయం సరైనదని అన్నారు. 'సత్యమేవ జయతే,' ' ఓం నమో వెంకటేశాయ' అంటూ ట్వీట్ చేశారు. శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిన పిటిషన్పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిష్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

# మహిళలకు దసరా కానుక

మొదటి పేజీతరువాయి...

దసరా నుంచి అమలు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు అని అంటున్నారు. మహిళలకు దసరా కానుకగా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వరాన్ని బాబు ఇవ్వబోతున్నారు అని పెద్ద ఎత్తున ప్రచారం అయితే సాగుతోంది. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం విషయం మీద మంత్రి వర్గం సీరియస్ గనే చర్చిస్తుంది అని అంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారుల బందం కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో పర్యటించి వచ్చి మరీ ఒక నివేదికను ప్రభుత్వానికి అందించారు అని అంటున్నారు. ఆ నివేదిక మీద మంత్రి వర్గం కీలకమైన నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. జిల్లా పరిధిలోనే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది అని అంటున్నారు. అంటే సొంత జిల్లాలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వెళ్లవచ్చు. మరి దీనికి సంబంధించి విధి విధానాలను కూడా ఖరారు చేశారు అని అంటున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఈ చాన్స్ అని అంటున్నారు. పేదరికమే కొలమానంగా ఈ ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలా లేక అందరికీ అవకాశం ఇవ్వాలా అన్న చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొన్ని బస్సులను మాత్రమే ఫ్రీ సర్వీస్ కోసం రిజర్వ్ చేసి పెడితే మిగిలిన బస్సులలో ఆదాయం వస్తుంది అలాగే ప్రయాణీకులు అందరూ వాటిలో ప్రయాణించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారుట. అదే విధంగా ఈ నెలాఖరున వచ్చే దీపావళి నుంచి ఉచితంగా మహిళలకు మూడు వంట గ్యాస్ సిలిండర్లను కూడా ఇచ్చే పథకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇక మహిళలు పద్దెనిమిదేళ్ళు నిండితే చాలు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న దాని మీద కూడా మంత్రి మండలి చర్చిస్తుందని అయితే అది మాత్రం ఇపుడే కాదని విధి విధానాలు పూర్తిగా రూపొందించిన మీదటనే నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా రైతులకు ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇచ్చే పథకాన్ని కూడా పీఎం కిసాన్ పథకంతో జత చేయడం ద్వారా ఆరు వేల రూపాయల భారాన్ని తగ్గించుకుంటూ మిగిలిన మొత్తానికి విడతల వారీగా అందచేయడానికి చూస్తున్నారని చెబుతున్నారు. ఈ పథకాన్ని సంక్రాంతికి అమలు చేసే విషయం కూడా మంత్రి మండలి సమావేశంలో చర్చిస్తారు అని అంటున్నారు. ఇక తల్లికి వందనం పథకం అయితే వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని అనుకుంటున్నారు. ఏది ఏమైనా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యేలోపుగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలని పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. వైసీపీ నుంచి ఏ ఒక్క విమర్శ రాకుండా ఈ పథకాలను అమలు చేసి తమ సత్తా నిరూపించుకోవాలని టీడీపీ కూటమి చూస్తోంది అని అంటున్నారు. మొత్తానికి ఫ్రీ బస్సు పథకం కనుక దసరాకు అమలు అయితే మహిళలకు పెద్ద బహుమతే బాబు ఇస్తున్నట్లుగా భావించాలి అని అంటున్నారు.

## బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

మొదటి పేజీతరువాయి...



సమేత మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిలో మాడవీధుల్లో ఊరేగించారు. ధ్వజపటాన్ని కూడా ఊరేగిస్తూ బ్రహ్మోత్సవాలకు దేవతలందరికీ ఆహ్వానం పలికారు. సాయంత్రం 5.45- 6గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

### తిరుమలలో గోవింద నామస్మరణే ప్రతిధ్వనించాలి

పవిత్రమైన తిరుమలలో గోవింద నామస్మరణ మాత్రమే ప్రతిధ్వనించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఆయన ఆలయంలోని రంగనాయక మండపంలో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు దాదాపు 15లక్షల మంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇక్కడికి వచ్చేవారితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు కూడా వాహన సేవలు వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అందరికంటే ఎక్కువసార్లు బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ లాంఛనాలు సమర్పించే అవకాశం లభించినందుకు గర్వపడుతున్నానన్నారు. అందరూ తిరుమల పవిత్రతను కాపాడాలని చంద్రబాబు కోరారు.

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు దంపతులు శ్రీ వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి సాయంత్రం చేరుకున్న ముఖ్యమంత్రి... కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత సంప్రదాయ వస్త్రధారణతో సతీమణి నారా భువనేశ్వరితో కలిసి బేడీఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు సీఎం తలకు పరివట్టం చుట్టి, శేషవస్త్రాన్ని మెడలో ధరింపజేశారు. అనంతరం నూతన పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మూలవర్లను దర్శించుకుని రంగనాయకుల మండపం చేరుకోగా వేదపండితులు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా టీటీడీ ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన వాహన మండపానికి చేరుకుని రాత్రి 9గంటలకు పెద్దశేష వాహనంలో పాల్గొని, ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఐదు గ్లోబల్ ట్రేడ్ సెంటర్లు

మొదటి పేజీతరువాయి...

శాఖ మంత్రులు, ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా గ్రూపుల మహిళలతో విస్తృత స్థాయిలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని కేంద్ర పథకాలతో అనుసంధానం చేయాలని సూచించారు. 'ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో ముందుకు సాగుదామని చెప్పారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి భరోసా ఏర్పడుతుందని చెప్పారు. అధికారులు తయారు చేసిన ఎంఎస్ఎంఈ పాలసీ డ్రాఫ్టో మార్పులు, చేర్పులను సీఎం సూచించారు. ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంగా దూరదృష్టితో సాహసోపేతమైన చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునే దిశగా అత్యుత్తమ ప్రణాళికలు సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్ల ఆదాయం 6 నెలల్లో రూ.3,971 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రూ.3,971 కోట్ల ఆదాయం సాధించింది. గతఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయం కంటే 18 శాతం తగ్గడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.13,500 కోట్లు ఆర్జించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. సీఎం చంద్రబాబు శుక్రవారం ఆదాయార్జన శాఖలపై సమీక్ష నిర్వహించారు. సొంత ఆదాయాలను మెరుగుపరచి ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.13,500 కోట్ల ఆదాయం సాధ్యం కాకపో వచ్చని, రూ.11,000 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు వెల్లడించారు. భూముల మార్కెట్ విలువ సవరిస్తే రూ.1000 కోట్ల అదనపు ఆదాయం సాధించ వచ్చన్నారు.

## పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి

మొదటి పేజీతరువాయి...

నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... అన్ని మతాలను పవన్ కళ్యాణ్ సమానంగా చూడాలని కోరారు. ఒక మతానికే ప్రతినిధిగా పవన్ వ్యవహరిస్తున్నారని వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆ వేషం వేసుకుని హిందూ మతం గురించి మాట్లాడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ చర్యల వల్ల ఇతర మతాలను ఆచరించే వారిలో అభద్రతా భావం ఏర్పడదా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డైరెక్షన్లో పవన్ కళ్యాణ్ యాక్ట్ చేస్తున్నారని విమర్శలు చేశారు. ఆర్.యస్.యస్ భావజాలం బీజేపీ పాటిస్తుందని వైఎస్ షర్మిల ఆరోపించారు. జనసేన సెక్యులర్ పార్టీ అనుకున్నామని.. కానీ పవన్ కూడా ఆర్.యస్.యస్ సిద్దాంతంతో వెళ్తున్నారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. మణిపూర్లో క్రైస్తవులపై ఊచకోత కోస్తే పవన్ ఎందుకు మాట్లాడరని వైఎస్ షర్మిల అడిగారు. ఇతర మతాల వారు ఓట్లు వేస్తేనే పవన్ గెలిచారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పుడు ఒకే మతం అంటున్న పవన్ను ఇతర మతాల వారు ఆదరిస్తారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ యాత్ర చేశారని గుర్తు చేశారు. అటువంటి నేతను... పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాయ నుంచి పవన్ కళ్యాణ్ బయటకురావాలని వైఎస్ షర్మిల హితవు పలికారు.

## బాబుకు భయం లేదు.. భక్తి లేదు..

**అమరావతి, అక్టోబర్ 4 (మనం న్యూస్):** తిరుమల లడ్డు వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సిట్ను సుప్రీం కోర్టు రద్దు చేసి, ప్రత్యేక కమిటీ ద్వారా విచారణకు ఆదేశించిన నేపథ్యంలో.. మాజీ సీఎం జగన్ తాజాగా స్పందించారు. తాడేపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అబద్దాలు మాట్లాడే సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ విచారణను రద్దు చేసి, సిబిఐ విచారణకు ఆదేశించడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. టీటీడీ అనేది ఒక పెద్ద వ్యవస్థ అని, అక్కడ కల్తీ జరిగే అవకాశం ఉండదన్నారు. అన్నీ పరీక్షలు చేసిన అనంతరం ట్యాంకర్ల నెయ్యిని లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. అలాగే సాక్షాత్తు టీటీడీ ఈవో లడ్డు తయారీకి కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని ప్రకటించినా.. సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు అబద్దాన్ని నిజం చేసేందుకు విశ్వప్రయత్నం చేశారన్నారు. జూలై 6న వచ్చిన నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపడం జరిగిందని ఈవో ప్రకటించినా.. డైవర్షన్ పాలిటిక్స్లో భాగంగా నెయ్యి కల్తీ వ్యవహారాన్ని బాబు తెర మీదికి తెచ్చారన్నారు. తిరుమల ప్రతిష్టను, లడ్డు విశిష్టతను దెబ్బతీసేందుకు.. బాబు రాజకీయం గా ఈ వివాదాన్ని తెరమీదికి తెచ్చారన్నారు. సుప్రీం కోర్టు అక్షింతలు వేసినా.. టీడీపీ సోషల్ మీడియా ద్వారా తమ నేతలకు చుక్కెదురైందని ప్రచారం చేస్తున్నారన్నారు. దైవం అంటే బాబుకు భయం, భక్తి లేదని.. అదే ఉండి ఉంటే ఇప్పటికే ప్రజలకు క్షమాపణలు చెప్పేవారని తెలిపారు. కోట్ల మంది మనోభావాలు దెబ్బతీసేందుకు గ్లోబల్ ప్రచారంను టీడీపీ సాగించిందని తెలుపుతూ తాము ప్రధానికి లేఖ రాశామన్నారు. ఇప్పటికైనా బాబు బుద్ధి మారాలని జగన్ అన్నారు. బాబు లాంటి పొలిటీషియన్ ఉండడం మన ఖర్మ అంటూ.. ఇలాంటి పొలిటీషియన్ రాకూడదన్నారు. లడ్డు విశిష్టతను తగ్గించేందుకు బాబు కుట్ర పన్నినట్లు తాను భావిస్తున్నానన్నారు. అలాగే 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న చంద్రబాబు.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. బాబు చెప్పిన అబద్దాలను ప్రజలు విశ్వసించే స్థాయిలో కూడా లేరన్నారు. పవన్ వారాహి సభ ద్వారా చేసిన కామెంట్స్ పై జగన్ మాట్లాడుతూ.. పవన్కు సనాతన ధర్మం అంటే ఏ మేరకు తెలుసో నాకు అర్థం కావడం లేదన్నారు. తిరుమల పవిత్రతను బాబు దెబ్బ తీస్తుంటే.. పవన్ సనాతన ధర్మం అంటూ వత్తాసు పలుకుతున్నారన్నారు. అలాగే రాజకీయ దుర్బుద్ధి కోసం లడ్డు వివాదాన్ని తీసుకువస్తే.. పవన్ తప్పు తెలిసినా కూడా బాబుకు మద్దతు తెలిపి అభాసు పాలవుతున్నట్లు తెలిపారు.

# జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -30) పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం

## కానరాని ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు

**చింతూరు, అక్టోబర్ 04 (మనం న్యూస్) :** అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక నుండి చత్తీస్గడ్ వైపు వెళ్లే జాతీయ రహదారి ఎన్ హెచ్ 30 రహదారి విస్తరణ పనులు కాంట్రాక్టర్ కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. దీంతో పనుల నాణ్యత పై స్థానికులు ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చింతూరు మండలం మారుమూల ప్రదేశం కావడంతో కాంట్రాక్టర్లకు నాసిరకంగా పనులు చేసి బిల్లులు చేసుకొని సొమ్ములు పోగేసుకుంటున్నారు. వందల కోట్ల రూపాయల జాతీయ రహదారి పనులు నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఆడింది ఆటగా పాడింది పాటగా తయారైంది. రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత లోపంపై మనం పత్రికలో వరుస కథనాలు వస్తున్నా అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించడం లేదు. పనులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అదేమంటే శాఖకు సంబంధిత శాఖ కార్యాలయం ప్రస్తుతం పనులు నడుస్తున్న చింతూరు మండలానికి సుదూరంగా ఉండటంతో అధికారులు పనులను పర్యవేక్షించేందుకు రావడం లేదన్నది ప్రధాన ఆరోపణగా వినిపిస్తుంది.



నిజానికి గ్రామస్థాయిలో చిన్న రోడ్డు నిర్మాణం జరిగిన సంబంధిత అధికారులు ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి నాణ్యతను పరిశీలిస్తారు. అనంతరం బిల్లులు చేస్తారు. కానీ వందల కోట్ల రూపాయల రహదారి పనులు పది కాలాలు ఉండాల్సిన జాతీయ రహదారి పనులను కాంట్రాక్టర్లకే వదిలి అధికారులు మీరే నాణ్యంగా నిర్మించుకోండి అనటం ఎంతవరకు సబబు అనేది రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు రహదారి నిర్మాణం పనులలో జరిగిన అవకతవకలను మనం పత్రిక వెలుగులోకి తెచ్చినా దీనిపై అధికారుల్లో ఎలాంటి కదలిక లేకపోవడం పలు అనుమానాలకు



తావిస్తోంది. పారదర్శకంగా నాణ్యతగా రహదారులు నిర్మించాల్సి ఉన్నా.. నాణ్యతను గాలికొదిలి నాసిరకంగా పనులు జరిగేందుకు సంబంధిత అధికారుల తోడ్పాటు ఎంతైనా ఉందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా జాతీయ రహదారి పనులను సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించి సక్రమంగా తనిఖీలు చేపట్టి పనుల్లో నాణ్యతను పెంచి రహదారి పది కాలాలపాటు ఉండేలా చర్యలు చేపట్టాలని చింతూరు మండల ప్రజలు, మేధావులు, రాజకీయ నాయకులు కోరుతున్నారు.

# పండగ పూట ధరల భారం

- విపరీతంగా పెరిగిన వస్తువుల ధరలు
- భారీగా పెరిగిన వంట నూనెల ధరలు
- కొండెక్కిన కూరగాయల ధరలు
- విపరీతంగా పెరిగిన చికెన్, మటన్ ధరలు
- బట్టలకు పెరిగిన డిమాండ్... ధరల పెరుగుదల







**నల్లగొండ, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** దసరా పండగ వస్తూ ఉండడంతో తో నిత్యవసర వస్తువుల ధరలతో పాటు కూరగాయల ధరలు ఆకుకూరలు ధరలు చికెన్ మటన్ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు బట్టల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి .పేద మధ్యతరగతి ప్రజలు పండగ చేసుకోవాలంటే ప్రస్తుతం ఇబ్బందిగానే మారింది. రోజురోజుకు ధరలు పెరుగుతూ ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.దసరా పండుగకు 20 రోజుల ముందుగానే ప్రజలపై ధరల పెరుగుదల ప్రభావం పడింది. అన్ని రకాల వస్తువులు ధరలు ఒకసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం దసరాలో సాధారణంగా ఎవరైనా ఎక్కువగానే వంటనూనె ఉపయోగిస్తారు. ఎందుకంటే పిండి వంటలు అధికంగా చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి అధికంగా ఉపయోగిస్తారు ప్యాకెట్ కు ఒక కిలో 150 వరకు ఉన్నది. పామ్ ఆయిల్ లీటర్ కు 140 నుండి150 వరకు ధర పలుకుతూ ఉన్నది. చెప్పాల్సిన అవసరం లేకుండా ధరలు పెరిగాయి. పేద మధ్య తరగతి ప్రజలు కూడా తప్పనిసరిగా దసరా పండుగ ముందు పిండి పదార్థాలు తయారు చేసుకుంటారు. ధరలు విపరీతంగా పెరగడంతో తమ ఇండ్లలో వారు ఆందోళనకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూనె ధరలపై ఎక్సైజ్ సుంకం 12 నుండి 32 శాతానికి పెంచడంతో ధరలు ఒకసారిగా పెరిగాయి .ఏ కూర చేయాలన్న పిండి వంటలు చేయాలన్న నూనె తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది ఈ విధంగా ఎక్సైజ్ సుంకం పెంచడం వల్ల కూడా ధరలు విపరీతంగా పెరిగాయి.

### విపరీతంగా పెరిగిన చికెన్, మటన్ ధరలు

ప్రస్తుతం దసరా పండుగ సీజన్లో చికెన్ మటన్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి బాయిలర్ చికెన్ కిలో స్కిన్ తో అయితే 165 రూపాయలు ఉన్నది.స్కిల్ లెస్ చికెన్ కిలో అయితే 195 రూపాయలు ఉన్నది బాయిలర్ కోడి ఒక కిలో 130 రూపాయలు ఉన్నది నాటుకోడి కిలో 500 రూపాయల నుండి 600 రూపాయల వరకు ప్రస్తుతం ఉన్నది. మటన్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి కిలో మటన్ 800 రూపాయల వరకు ఉన్నది తలకాయ కూర కిలో 600, బోటి 350 రూపాయలు ప్రస్తుతం ఉన్నది. ప్రస్తుతం చికెన్ మటన్ అధికంగా కొనాలన్నా కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది పండుగ నాటికి చికెన్ మటన్ ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

### కొండెక్కిన కూరగాయల ధరలు

కూరగాయల ధరలు కూడా విపరీతంగా ప్రస్తుతం పెరిగాయి టమాటాలు కిలో 60 రూపాయలు ఆలుగడ్డలు కిలో 50 రూపాయలు బెండకాయ కిలో 40 రూపాయలు , పచ్చిమిర్చి కిలో 6 రూపాయలు చిక్కుడుకాయ కిలో 80 రూపాయలు, క్యారెట్ కిలో 70 రూపాయలు ,బీట్రూట్ కిలో 80 రూపాయలు, దోస కిలో 50 రూపాయలు కాకరకాయ కిలో 50 రూపాయలు చామగడ్డ కిలో 60 రూపాయలు ఉంది. ప్రస్తుతం ఉల్లిగడ్డల ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. తెల్ల ఉల్లిగడ్డ కిలో 60 రూపాయలు ఎర్ర ఉల్లిగడ్డ కిలో 50 రూపాయల్లో వరకు ఉన్నది. వీటితోపాటు అన్ని రకాల పప్పుల ధరలు 20 రూపాయలు వరకు పెరిగాయి. దీంతో ఈ సంవత్సరం దసరా పండుగ చేసుకునేది ఎలా అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి ఏది కొనాలన్న ఒకటి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుందని జనం అంటున్నారు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతినడం దళారులు వ్యాపారులు కుమ్మక్కు.

### అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి

ఆకుకూరలది కూడా అదే దారి : అని రకాల కూరగాయలతో పాటు ఆకుకూరలు కూడా ధరలు పెరిగాయి. ఆకుకూర ధరలకు రెక్కలు వచ్చాయి పాలకూర తోటకూర తోట కూర గోంగూర బచ్చలి కూర తదితర ఆకుకూరల ధరలు భారీగా పెరిగాయి. గతంలో పాలకూర కట్టలు ఏది పది రూపాయలకు మూడు ఇచ్చేవారు ..కానీ ఇప్పుడు 20 రూపాయలకు మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు.. అదేవిధంగా కొత్తిమీర పుదీనా ధరలు కూడా పెరిగాయి కొత్తిమీర పది రూపాయలకు చిన్న కట్ట 20 రూపాయలకు పెద్దగ కట్ట ఇస్తున్నారు కొత్తిమీర చిన్న కట్ట పది రూపాయలు పెద్ద కట్ట 30 రూపాయలకు ఇస్తున్నారు. కరివేపాకు పది రూపాయలకు ఒక కట్ట ఇస్తున్నారు.

### బట్టలకు పెరిగిన డిమాండ్, పెరిగిన ధరలు:

పేదవారు అయినా ఉన్నవారైనా దసరా పండుగకు తప్పనిసరిగా కొత్త బట్టలు కొంటారు ..సంవత్సరానికి ఒకసారి వచ్చే పండుగ కాబట్టి తప్పనిసరిగా ఎవరైనా కొత్త బట్టలు కొని ఆనందపడతారు దీంతో ఈ సంవత్సరం కూడా బట్టల ధరలు విపరీతంగా పెరిగాయి రెడీమేడ్ వస్తువులు బట్టల ధరలకు రెక్కలు వచ్చాయి మామూలుగా పాయింట్ షర్టు మగవారి వి కొనాలంటే 1500 రూపాయల నుండి 2000 రూపాయలకు ఖర్చు అవుతుంది. మంచివి నాణ్యమైనవి బట్టలు కొనాలంటే ఒక జతకు 5000 నుండి 6000 వరకు ఖర్చవుతుంది టైలర్ వద్ద బట్టలు కుట్టించాలి అంటే ఒక జతకు 1000 వరకు తీసుకుంటున్నారు దీంతో పేద ప్రజలు కొత్త బట్టలు కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మూసీ సుందరీకరణ అడ్డుకుంటే జిల్లాలో బిఆర్ఎస్ భూస్థాపితం

- రామసాని నివాస్ రెడ్డి



**బీబీనగర్, అక్టోబర్ 04 (మనం న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టును అడ్డుకుంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతుందని కాంగ్రెస్ నాయకులు రామసాని నివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బీబీనగర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నిజాం కాలంలో ఏర్పడ్డ మూసి నది అప్పటి భాగ్యనగర్ ప్రజల దహార్తిని తీర్చేదని, తదనంతరం ఆయా ప్రభుత్వాల అధికారుల అసమర్థతతో కలుషితమయంగా మారిందన్నారు. మూసినదితో ఉప్పల్, ఘట్కేసర్, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ భువనగిరి, చౌటుప్పల్, మండలాల తోపాటు సూర్యాపేట వరకు పలువురు రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80 వేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. మూసి కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని 2006 లోనే అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉప్పల్ చెరువు కట్ట వద్ద సుమారు 300 కోట్లతో సీనరీ ప్రాంతం ఏర్పాటు చేశారన్నారు. గత పది ఏళ్ల కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు మూసి రివర్ ఫ్లాంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ను ఏర్పాటుచేసి మూసి సుందరికరణ చేపడుతామని ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు రైతులు ఇకనైనా మూసి కాలుష్యం నుండి విముక్తుల లభిస్తుందనుకుంటే బిఆర్ఎస్ పార్టీ మూసి కాలువ ఆక్రమణదారులను రెచ్చగొట్టి ప్రాజెక్టును అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న టిఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. మూసి ప్రాజెక్టు పై హైదరాబాద్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్లో చేపట్టిన మూసి నది పరిహారక సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## రక్తదానం చేద్దాం.. ఒక నిండు ప్రాణాన్ని కాపాడుదాం

- రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుంది
- ప్రాణం నిలిపే సాయం రక్తదానం
- హుజూర్ నగర్ జనచైతన్య ట్రస్ట్ అధ్యక్షుడు పారా సాయి



**హుజూర్ నగర్, అక్టోబర్ 04, (మనం న్యూస్) :** ఆపదలో ఉన్నవా రికి రక్తదానం చేద్దాం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుదాం అని హుజూర్ నగర్ జన చైతన్య ట్రస్ట్ అధ్యక్షుడు పారా సాయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఒక హాస్పిటల్ లో బి పాజిటివ్ రక్తం అత్యవసరం కావడం తో జనచైతన్య ట్రస్ట్ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన జనచైతన్య ట్రస్ట్ సభ్యులు ఏ పాజిటివ్ డోనర్ పాలకూరి అజయ్‌తో మాట్లాడి తిరుమల బ్లడ్ బ్యాంక్ వద్దకు తీసుకెళ్లి రక్తదానం చేశారు. సకాలంలో స్పందించిన జనచైతన్య ట్రస్ట్ సభ్యులకు, రక్త దానం చేసిన పాలకూరి అజయ్ లను పేషెంట్ బంధు వులు ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం ట్రస్ట్ సభ్యులు పారా సాయి పిల్లి శివశంకర్, మాట్లాడుతూ రక్తదానం అనేది చాలా గొప్ప పని ఎందుకంటే మనం రక్తాన్ని సృష్టించలేం దానం మాత్రమే చేయగలమని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు మూడు సార్లు రక్తదానం చేయవచ్చని మీరు చేస్తున్న రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని, ప్రాణం నిలిపే సాయం రక్తదానం అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య ట్రస్ట్ సభ్యులు దగ్గుపా టి రమేష్, కాశి విశ్వనాథ్, ఇంజమూరి జయంత్,కుక్కడపు సాయి, చంటి ,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**మర్రిగూడ, అక్టోబర్ 04 (మనం న్యూస్) :** మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో నైట్ వాచ్ మెన్‌గా పని చేస్తున్న టువంటి శంకర్ భార్య ఇటీవలే అనారోగ్యంతో చనిపోయింది. అతనికి ఖర్చుల నిమిత్తం పూర్వ ఉపాధ్యా యులు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం రోజు అందజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ టిఎస్ యూ టిఎఫ్ మర్రిగూడ మండల అధ్యక్షులు మహేశ్వరం వెంకటేశ్వర్లు, ఎం అభిలాష్, ఎన్.ఆంజనేయులు, కొండల్ తదితరులు ఉన్నారు.

## శ్రీ గాయత్రీ దేవి అవతారంలో దుర్గాదేవి

- సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు




**నేరేడుచర్ల, అక్టోబర్ 4 (మనం న్యూస్):** నేరేడుచర్ల శ్రీ విజయ దుర్గ దేవి ఆలయం, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయాలలో దసరా వేడుకల సందర్భంగా శ్రీ దుర్గా శరన్న వరాత్రి ఉత్సవాలలో శుక్రవా రం శ్రీ గాయత్రి దేవి అవతారంలో అమ్మలు కన్నా అమ్మ బెజవాడ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమి చ్చారు. వేద పండితులు ములుగు శ్రీనివాస చార్యులు, శివయ్య శాస్త్రి త్రికాల పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కుటుంబాలు బాగుండాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేరేడుచర్ల పట్టణంలో గతం లోఎస్సైగా విధులు నిర్వహించిన యాదవేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ విజయ దుర్గ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ కొనతం ఆదిరెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, రాచకొండ రామకోటేశ్వరరావు, నాగండ్ల శ్రీధర్, ఆకారపు వెంకటేశ్వర్లు, సూరిబాబు, కోనతం కృష్ణారెడ్డి, రావులపల్లి ప్రసాద్ యామిని వీరయ్య, కట్ట గణేష్ రెడ్డి, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కొంపముంచిన.. ఇసుక దందా..?

- మూడు స్టేషన్ల ఎస్సైలపై వేటు
- జిల్లా ఎస్పీకి రిపోర్ట్ చేయాలంటూ ఆదేశాలు
- పోలీసుల పనితీరుపై దృష్టి సారించిన రాష్ట్ర ఉన్నతాధికారులు
- రాజకీయ ఒత్తిడిలే కారణమా..?
- ల్యాండ్, ఇసుకపై ప్రత్యేక కన్ను
- ఇసుక మాఫియాపై చెక్ పడేనా..?

**సూర్యాపేట, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** జిల్లాలోని ఇసుక మాఫియా తమ రాజకీయ పలుకుబడి నాయకుల అండదండలతో ఈ మాఫియా తమ కనుసనుల్లో ఇసుక అక్రమ రవాణా తందాను కొనసాగిస్తూ కోట్లాది రూపాయలను బహిరంగంగా కొల్లగొడుతుంది ప్రభుత్వాలు ఎన్ని మారినా ఇసుక అక్రమ మాఫియాల కు కొమ్ము కాస్తుందనే ఆరోపణలు బహిరంగంగానే ప్రజల నుండి వినపడుతున్నాయి ఇసుక అక్రమ దోపిడీ చేస్తున్న అక్రమార్కులకు అండదండగా నిలుస్తూ కాసుల కోసం కక్కుర్తి పడుతున్న ఖాకీలపై రాష్ట్ర పోలీస్ ఉన్నత అధికార యంత్రాంగం కొరడాకూడా జల్పించింది... తాజా గురువారం రాష్ట్ర డిజిపి కార్యాలయం నుండి ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని నేథ్యంతో జిల్లాలోని తుంగతుర్తి ఆత్మకూరు ఎస్ పెన్ పహాడ్ మండలపోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ల రాష్ట్ర ఉన్నతాధికారులు ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా నివేదిక తెప్పించుకొని వేటు వేయడం జిల్లా పోలీస్ శాఖశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది...ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవలసిన పోలీసులు కంచె చేను మేసే చందంగా వ్యవహరించే పరిస్థితికి దిగజారడం రాష్ట్రస్థాయి పోలీస్ ఉన్నత అధికారులను సైతం కలవడానికి గురి చేసినట్లు విశ్వాసనీయంగా తెలుస్తుంది ఇసుక మాఫియా కు తమ వంతు సహకారం అందిస్తున్న పోలీస్ అధికారుల సమాచారాన్ని ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుసుకున్న మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో ఎస్సైలను రాష్ట్ర పోలీసు అధికారులు సస్పెండ్ చేయడం విశేషం నిరంతరం ఇసుక రవాణా అర్డులు చాస్తుండటంతో పోలీసుల వెంట కాసుల పంట పండిస్తుంది. ఎట్టకేలకు జిల్లాలో ఇసుక అక్రమ రవాణా దార్లకు వత్తాసు పలుకుతు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా జేబులు నింపుకుంటున్న కాకిలా తీరుపై దృష్టి సారించిన రాష్ట్ర పోలీసు ఉన్నత అధికారులు ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా ఇసుక అక్రమ రవాణాకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ముగ్గురు అధికారులపై వేటు వేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయానికి ఎటాచ్ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులో పేర్కొన్నట్టు తెలుస్తోంది ఇది ఇలా ఉండగా జిల్లాలోని వాగులు వంకలు అధికంగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణాకు మార్గాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి గత తొమ్మిది నెలలు కాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది ఈ నేపథ్యంలో దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తమ కొరడా చిలిపించినట్లు తెలుస్తోంది.



M.Z.O.No. 396/2024
Rc. No. 77/Estt-35/MZ-II/2024

Office of the
Inspector General of Police,
Multi Zone- II, Hyderabad.
Dated: 03.10.2024.

ORDER

Sub: Multi Zone- II- Transfer and posting of certain SIs/Inspectors of Police (Civil) of MZ-II- Orders issued- Reg.

-:o0o:-

The following SIs/Inspectors of Police (Civil) of MZ-II are hereby transferred as mentioned against their names at column No. 04.

| S.No | Name and rank (S/Sri) | Present Place of work | Transferred to |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | Edugu Ravi, SI | Wadapally PS, Nalgonda | To report before SP, Nalgonda |
| 2 | Satish Reddy, SI | Haliya PS, Nalgonda | |
| 3 | P. Ravinder, SI | Penpahad PS, Suryapet | To report before SP, Suryapet |
| 4 | Y. Saidulu, SI | Atmakur (S) PS, Suryapet | |
| 5 | Yedukondalu, SI | Thungathurthy PS, Suryapet | |
| 6 | P. Shankar, SI | Yalal PS, Vikarabad | To report before SP, Vikarabad |
| 7 | K. Girenna, SI | Peddemul PS, Vikarabad | |
| 8 | Lenin, SI | Uppununthula PS, Nagarkurnool | To report before SP, Nagarkurnool |
| 9 | Mahender, SI | Vangoor PS, Nagarkurnool | |
| 10 | Naresh, SI | Telkapally PS, Nagarkurnool | |
| 11 | Nagashekar Reddy, SI | Bijinapally PS, Nagarkurnool | |
| 12 | Vinay Kumar, SI | Sangareddy Rural, Sangareddy | To report before SP, Sangareddy |
| 13 | Nandikar Ramesh, SI | Veepangandla PS, Wanaparthy | To report before SP, Wanaparthy |
| 14 | N. Ashok, Inspector of Police | Tandur Rural Circle, Vikarabad | To report in MZ-II |
| 15 | G. Santosh Kumar, Inspector of Police | Tandur Town PS, Vikarabad | |
| 16 | Ashok, Inspector of Police | Sangareddy Rural Circle, Sangareddy | |

The Unit Officers concerned are requested to take further necessary action accordingly and intimate the dates of relieve and reporting for duty to this office for record.

Inspector General of Police,
Multi Zone- II, Hyderabad.

To,
The individuals (through concerned).
The SsP, Nalgonda, Suryapet, Vikarabad, Sangareddy, Nagarkurnool, Wanaparthy for n/a.
The DIsG, Zone- V Yadadri, Zone- VI Charminar and Zone- VII Jogulamba for n/a.
Copy to M.Z.O. Book and SC- Section, MZ-II.

### రాజకీయ ఒత్తిడిలే కారణమా..?

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలలో స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు పలుకుబడి గల నాయకుల గృహ నిర్మాణాల ప్రమేయం మేరకు ఈ అక్రమ దందా జోరుగా సాగుతుందనే విమర్శలు ఎంతో కాలంగా వినిపిస్తుంది దీనికి తోడు కొంతమంది. ఖాకీల చేతివాటం మే కూడా ఒక రకమైన కారణమని చెప్పవచ్చు..

### జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలపై నిఘా

జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలున్న ప్రాంతాలైన సూర్యాపేట రూరల్ నడిగూడెం కోదాడ మునగాల పెన్ పహాడ్ చిలుకూరు గరిడేపల్లి జాజిరెడ్డి గూడెం తుంగతుర్తి ఆత్మకూరు (ఎస్ )మండలాల నుండి వివిధ ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అనేక పోలీస్ స్టేషన్లో పరిధిలోని ఎస్ఐలపై కూడా రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది ఎప్పటికప్పుడు నిఘా విభాగాల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నట్లు వినికిడి.

# దేవస్థాన పాలక మండలి ప్రమాణ స్వీకారం

- దేవస్థాన నూతన చైర్మన్‌గా యరగాని గురవయ్య



**హుజూర్ నగర్, అక్టోబర్ 04 (మనం న్యూస్) :** మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో అత్యంత ప్రాచీనమైన దేవాలయం శ్రీ శాల్మలికంద ఆదివరాహ వేణుగోపాలస్వామి దేవస్థాన నూతన చైర్మన్,ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ తరపున పర్యవేక్షణ అధికారిగా గుజ్జుల కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నూతన చైర్మన్ గా యరగాని గురవయ్య, ధర్మకర్తలుగా గంధం అంజయ్య,తిపిరిశెట్టి హరీష్,మెరిగ కవిత,వేముల నరసింహారావు,కోలా కృష్ణ ప్రసాద్, పెనుబెల్లి హనుమంతరావు,ఎక్స్ అఫీషియో మెంబర్ గా ముడుంబై హరీష్ కుమారాచార్యులుతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య మాట్లాడుతూ మండల పరిధి లోనే అత్యంత ప్రాచీనమైనది బూరుగడ్డ దేవాలయం అని ఈ దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.అలాగే చైర్మన్‌గా పదవి బాధ్యతలు అప్పగించిన మంత్రి ఉత్తమ్ కు పాలకవర్గం వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎంపీ లక్ష్మణ రావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారా చార్యులు,మాజీ టీటీడీ బోర్డు మెంబర్ సాముల రామిరెడ్డి,ఏజీపీ నట్టే సత్యనారాయణ,నారపురాజు శ్రీనివాసరావు,యరగాని నాగన్న, దేశ్ ముఖ్ అరుణ్ కుమార్,గూడెపు శ్రీనివాస్,ఈడుపుగంటి సుబ్బా రావు, దొంగరి వెంకటేశ్వర్లు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, కుక్కడపు బాలకృష్ణ, తదితరులు, పాల్గొన్నారు.

## మాడుగులపల్లి మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**మాడుగులపల్లి, అక్టోబర్ 4 (మనం న్యూస్) ః** మాడుగులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం మండల అధ్యక్షులు బొమ్మకంటి నర్సింహా ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షులు బొమ్మకంటి నరసింహా మాట్లాడుతూ సభ్యత నమోదు కార్యక్రమంలో అందరూ భాగ్యస్వామ్యాలుగా నడిచి నలగొండ జిల్లాలోని మాడుగులపల్లి మండలంను అగ్రగామిగా నిలిపేలా,చూడాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ అసెంబ్లీ సభ్యత్వ ఇంచార్జ్ పోతెపాక సాంబన్న, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఇటికలా జాన్ రెడ్డి, గుడుగుంట్ల శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమళ్ళ నాగరాజు, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు జక్కా ఇందిరా, మాడ్గులపల్లి బూత్ తదితరులు పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్సలకు ఎల్‌ఓసిల మంజూరు

- ఎంపీ వద్దిరాజు సిఫారసు



**ఖమ్మం, అక్టోబర్ 4 (మనం బ్యూరో):** అనారోగ్యంతో బాధపడుతూ.. శస్త్ర చికిత్స చేయించుకునే స్థోమత లేని ఇద్దరికి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధితులకు చెరో రూ. 2 లక్షల రూపాయల చొప్పున మొత్తం రూ.4 లక్షల ఆర్థిక సాయం అందేలా చేశారు. ఈ మేరకు వారికి ఎల్వోసీ మంజూరు పత్రాలు అందజేసి.. శస్త్ర చికిత్సకు సాయ పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ములకలపల్లి మండలం వేపల గడ్డకు చెందిన వై.వెంకటేశ్వర్లు, కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామానికి చెందిన బి.హారిక గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వేర్వేరుగా.. స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చికిత్స కోసం వెళితే.. హైదరాబాద్ కు వెళ్లాలని సూచించారు. ఈ మేరకు నిమ్స్ ఆసుపత్రిలో సంప్రదించడంతో.. శస్త్ర చికిత్స చేయాలని అందుకు భారీగా ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో ఆ కుటుంబాలు వైద్య సాయం కోసం ఖమ్మంలో ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సంప్రదించారు. ఎంపీ రవిచంద్ర సిఫారసు మేరకు.. తెలంగాణ ప్రభుత్వం చెరో రూ. 2 లక్షలను మంజూరు చేస్తూ.. ఎల్వోసీలు జారీ చేసింది. వీటిని ఎంపీ రవిచంద్ర కార్యాలయ సిబ్బంది బాధితులకు అందజేశారు.

## వైద్యశాలల రూపు రేఖలను మారుస్తాం

- భద్రాచలం ఐటిడిఏ పివో రాహుల్



**చర్ల, అక్టోబర్ 4 (మనం న్యూస్) :** భద్రాచలం ఐటిడిఏ పరిధి లోని ప్రభుత్వ వైద్యశాల రూపురేఖలను మరో నాలుగు నెలలలో పూర్తిగా మార్చివేస్తామని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం అయిన మండలంలో పర్యటించి చర్ల లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడి స్థితిగతులను పరిశీలించారు. అక్కడి సమస్యలను వైద్యులు సాయి వర్ధన్, దివ్యనయన లను అడిగి తెలుసుకున్నారు. వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. త్వరలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వైద్యశాలలో సేవలను మెరుగుపరుస్తామన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య సేవలను బలోపేతం చేస్తామన్నారు. చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో త్వరలో వైద్యుల నియామకంతో పాటు సరిపడా మందులను సరఫరా చేస్తామన్నారు. వలస ఆదివాసీ గ్రామాల్లో సేవలు మెరుగుపరిచేందుకుగాను స్థానికంగా గిరిజన భాష తెలిసిన సిబ్బందిని నియమిస్తామన్నారు. అటవీ ప్రాంత గ్రామాలకు 108 వాహనం వెళ్లే పరిస్థితి లేకుంటే అటువంటి ప్రాంతాల్లో మొబైల్ బైక్ అంబులెన్స్ లను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాకాలంలో గర్భిణీ స్త్రీలను వారం ముందు ఆసుపత్రికి తరలించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇందుకుగాను బర్త్ వెయిటింగ్ గదులను ఆధునికంగా రూపొందిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకుగాను అవసరమైన చోట కొత్తగా ఆరోగ్యం ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులలో అరగంటలోపే వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం ఉన్న ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులకు అర్ధ గంటలోపు రోగి, గర్భిణి చేరుకునేలా కార్యచరణను రూపొందిస్తామని వెల్లడించారు.

## కాటమయ్య కిట్లతో గౌడ అన్నలకు అండ

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్.రామచంద్రు నాయక్



**మరిపెడ, అక్టోబర్ 4 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికుల రక్షణకై తీసుకొని వచ్చిన అభయ హస్తం-కాటమయ్య రక్షణ కవచం పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆడిటోరియంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాటమయ్య కిట్ల పంపిణీ కార్యక్రమానికి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్. రామచంద్రు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ప్రతి గ్రామానికి చెందిన పదిమంది గౌడ సోదరులకు అభయ హస్తం-కాటమయ్య రక్షణ కవచం(కిట్లు) పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒంటికొమ్ము. యుగంధర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ ఎన్ఫోర్స్మెంట్ సూపర్డెంట్ కిరణ్,జిల్లా నాయకులు పానుగోత్. రాంలాల్,కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన. ఐలమల్లు, మరిపెడ టౌన్ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, ఇతర మండలాల పార్టీ అధ్యక్షులు, గౌడ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ మోడల్ గ్రామంగా సిరిపురం

- గ్రామంలో పర్యటించిన ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి
- రైతులతో, గ్రామస్తులతో అవగాహనా సదస్సు





**మధిర, అక్టోబర్ 04 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్ కింద సోలార్ మోడల్ గ్రామంగా ఎంపికైన సిరిపురం గ్రామాన్ని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, టిజిఆర్ఈడిసిఓ విసి అండ్ ఎమ్‌డి అనిలా వావిళ్ళ, ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్, జియం ఐపీసీ మల్లికార్జున్, పంచాయితీ, వ్యవసాయ అధికారులు శుక్రవారం పర్యటించారు. పలువురు గ్రామస్తులు, రైతులతో పైలట్ ప్రాజెక్ట్ గురించి వివరించారు. సిరిపురం గ్రామంలో దాదాపు 1039 గృహ వినియోగదారులు, 520 వ్యవసాయ వినియోగదారులు ఉన్నారని విద్యుత్ శాఖ , రెడ్కో ఆధ్వర్యంలో సర్వే చేసినట్లు కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. గృహ వినియోగదారుల సర్వే పూర్తిగా, వ్యవసాయ సర్వీసుల సర్వే సగం పూర్తి అయ్యిందని, మిగతా సర్వీసుల సర్వే మరో మూడు రోజుల్లో పూర్తి అవుతుందని అన్నారు. ఈ సర్వీసుల వివరాలను పిఎం సూర్య ఘర్ పోర్టల్ లో నమోదు చేస్తున్నామని వివరించారు. సిరిపురం లోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగహనా సదస్సులో కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లు పెట్టాలని, అలాగే వ్యవసాయ పంపు సెట్లకు కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో అవగాహన కల్పించామన్నారు. సౌర ప్యానెల్స్ ప్రాముఖ్యత గురించి వివరించామని, పైలట్ ప్రాజెక్టు క్రింద సిరిపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏ విధమైన ఆర్థిక భారం లేకుండా ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నామని తెలిపారు. సౌర ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వినియోగదారులు మిగిలిన విద్యుత్తును డిస్కంకు విద్యుత్ సరఫరా చేయవచ్చని తద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. ఆర్థిక ప్రయోజనాలు, స్వయం సమృద్ధిగా దిశగా ఎదుగుతారన్నారు. సౌర ప్యానెల్స్ ఏర్పాటుకు తగిన రూఫ్ లేని 201 గృహ సేవల కోసం, టిజిఆర్ఇడిసిఓ విసి అండ్ ఎమ్‌డితో మాట్లాడి హై-రైజ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సమీప రైతులు ఒక వేదికగా చేరి, ఒకే ప్రదేశంలో సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పునరుత్పాదక శక్తి ప్రోత్సహించడం, స్థానిక గ్రామస్థులకు ఆర్థిక ప్రయోజనాలను అందేలా చేయడం, పర్యావరణ పరిరక్షణను సాకారం చేయడం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. బొగ్గు తదితర శిలాజా ఇంధనాల ద్వారా పర్యావరణనికి హాని కలగడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తుందని ఇలాంటి దుష్పరిణామాలను నివారించడానికి సౌర విద్యుత్ ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన సిరిపురం గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సింగరేణి ప్రభావిత గ్రామంలో మౌళిక సదుపాయాలు

- సైలో బంకర్ కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు
- ఎమ్మెల్యేతో కలిసి పర్యటించి కలెక్టర్



**ఖమ్మం, అక్టోబర్ 4 (మనం న్యూస్):** సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయితో కలిసి సత్తుపల్లి మండలంలోని సింగరేణి ప్రభావిత కిష్టారం గ్రామంలో పర్యటించి కాలుష్యం, బాంబు పేలుళ్ళు, వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన సైలో బంకర్ ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నీరు, వాయు, ఇతరత్రా కలుషితం అవుతున్నాయని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సింగరేణి భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కొంత మంది చేసే త్యాగాల కారణంగా అందరికీ లాభం లభిస్తున్నప్పటికీ, త్యాగాలు చేసిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉంటుందని అన్నారు. సైలో బంకర్ నుంచి వచ్చే కాలుష్యాన్ని మరింత అరికట్టేందుకు సింగరేణి జీఏం తో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కాలుష్య ప్రభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. బ్లాస్టింగ్, వర్షాల కారణంగా ఇండ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని అక్కడే మళ్లీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సింగరేణి జీఎం వద్ద ఇప్పటికే ఇండ్ల నిర్మాణం కోసం కొంత నిధులు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన నిధులను విడుదల చేయించి ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా అయ్యే విధంగా చూస్తామని అన్నారు. గ్రామాల్లో ఉండాల్సిన మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలు, వైకుంఠ దామాలు, తాగునీటి సరఫరా, మొదలగు సౌకర్యాలు కల్పించాలని, ఆ దిశగా సింగరేణి సంస్థతో కలిసి పని చేస్తామని అన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల కోసం డిజిటల్ క్లాసు రూమ్, వంట గదులు, సోలార్ ప్యానెల్స్ మొదలగు సౌకర్యాలను వెంటనే కల్పించాలని అన్నారు. రాబోవు తరాలను ఆదుకునే బాధ్యత మనపై ఉన్నందున వీటిని వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి చేయగలిగే ప్రతి పని పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, ఓపెన్ కాస్ట్ మైనింగ్ వచ్చిన తర్వాత కిష్టారం గ్రామం ఎలా మారిందో మనందరం గమనించామని, ఇక్కడి పరిస్థితుల గురించి మేలు చేయడం కోసం వాగ్దానం చేశామని అన్నారు. ప్రజల సంక్షేమం, ఆరోగ్యం ముఖ్యమైన ఉద్దేశంతో ఈ సమస్యను అసెంబ్లీలో లేవనెత్తానని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకు వెళ్లడం వల్ల కొన్ని చర్యలు తీసుకున్నారని అన్నారు. వర్షాకాలంలో చాలా ఇండ్లు దెబ్బ తిన్నాయని, ప్రజలు ఇండ్లలో ఉండలేని పరిస్థితి ఉందని, ప్రత్యేక సర్వే నిర్వహించి అందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. సైలో బంకర్ ద్వారా కలిగే కాలుష్యాన్ని, అంబేద్కర్ నగర్, ఎస్సీ, బీసీ కాలనీలోని ఇండ్ల పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారని, సమస్యలను ప్రజలు కూడా నివేదించడం జరిగిందని, వీటిని దృష్టిలో ఉంచుకొని న్యాయమైన పరిష్కారం వచ్చేలా చూడాలని, అప్పటి వరకు ప్రజలకు అండగా ఉండాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వర రావు, ఎంపిడిఓ చిన్న నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, సింగరేణి అధికారులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన షాదీఖానా నిర్మాణ పనులు పూర్తి

- కబరస్థాన్ ఏర్పాటుకు త్వరలో స్థలం గుర్తింపు
- పాఠశాల, ఆసుపత్రుల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత
- షాదీఖానా భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎంఎల్ఏ మట్టా రాగమయి



**కల్లూరు, అక్టోబర్ 4 (మనం న్యూస్):** కల్లూరు పట్టణంలో పెండింగ్‌లో ఉన్న షాదీఖానా నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు పట్టణంలో నిర్మిస్తున్న షాదీఖానా భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయితో కలిసి పరిశీలించారు. గోడల దశలో ఆగిపోయిన షాదీఖాన భవన నిర్మాణ పనులు ముందుకు సాగక, నిలిచిపోయి ఉండటానికి గల కారణాలను, అటవీ శాఖతో ఉన్న స్థల వివాదం వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఇటీవల వచ్చిన వరదల కారణంగా షాదీఖానా భవన నిర్మాణ పనులు పరిశీలనకు రావడం ఆలస్యమైందని, ఆలస్యమైనప్పటికీ దృఢంగా పనిచేసే భావంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన షాదీఖానా భవన నిర్మాణ పనులు చేపట్టి రెండు, మూడు నెలల్లోపూర్తి చేయడం జరుగుతుందని, నిధులకు ఎటువంటి కొరత లేదని, భూ సమస్య కూడా సర్వే చేపట్టి పరిష్కరిస్తామని అన్నారు. కబరస్థాన్ ఏర్పాటుకు కూడా త్వరలోనే భూములు గుర్తించి అందించడం జరుగుతుందని అన్నారు. షాదీఖానా, కబరస్థాన్ వంటి మౌళిక వసతులు అందించడంతో పాటు వాటి నిర్వహణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆసుపత్రులు, పాఠశాలలపై శ్రద్ధ వహిస్తున్నారని, సత్తుపల్లి పరిధిలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు నిధులు కేటాయించడంతో పాటు అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆసుపత్రులలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు పరిశీలించాలని, వచ్చిన మార్పును గమనించి పిల్లలను ప్రైవేటు బదులకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కలెక్టర్ కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో చదివే పిల్లల తల్లులను భాగస్వామ్యం చేస్తూ మౌళిక వసతులు కల్పించామని, ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని మెరుగు పరిచామని, పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచామని, విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యతోనే మనకు అభివృద్ధి సాధ్యమవుతుందని, ముఖ్యంగా బాలికలకు విద్య అందించడం ద్వారా సమాజం బాగుపడుతుందని, ఈ అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి మాట్లాడుతూ, షాదీఖానా నిర్మాణ పనుల స్థల సమస్యను కలెక్టర్ పరిశీలించి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. షాదీఖానాను బాగా నిర్మించి లోపల టైల్స్, ఫాల్ సీలింగ్ చేసి సాధ్యమైనంత వరకు అందంగా, ఆకర్షణీయంగా నిర్మిస్తామని అన్నారు. కల్లూరులో ఉన్న పేద ముస్లిం సోదరులకు చాలా ఉపయోగపడే విధంగా షాదీఖానాను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# రూ.4 కోట్ల విలువైన గంజాయి దహనం

- 3 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో 1065.13 కేజీల గంజాయి దహనం



ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల ఎక్సైజ్ అధికారులు, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ టీమ్లు కలిసి పట్టుకున్న గంజాయిని ఉన్నతాధికారుల అదేశాల మేరకు దబూగ్ధం చేశారు.

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (మనం ప్రతినిధి):** భద్రాది కొత్తగూడెం జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 1065.13 కేజీల గంజాయిని శుక్రవారం దగ్ధం చేశారు. భద్రాది కొత్తగూడెం పరిధిలోని పాల్వంచ, అశ్వరావుపేట, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 22 కేసుల్లో పట్టుకున్న గంజాయిని డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ విబి కమలాసన్రెడ్డి అదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనా ర్థన్రెడ్డి పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్ గణేష్ దగ్గరుండి గంజాయిని దగ్ధం చేయిం చారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ ఏఓబీ నుంచి తెలంగాణ, కర్ణాకట, మహారాష్ట్ర, తమిళ నాడు, గోవా రాజస్థాన్తో పాటు పలు రాష్ట్రాలకు సరపరా అవుతున్న గంజాయిని తీసుక వెళ్లాలంటే వయా ఖమ్మం, భద్రాచలం మీదుగా వెళ్లాల్సిందే. ఖమ్మంలో గంజాయిని, రంగారెడ్డి జిల్లాలో రూ.1.87 కోట్ల విలువ చేసే మద్యాన్ని ధ్వంసం చేశారు. ప్రభుత్వ అమోదిత డిస్ట్రాయిడ్ కన్సల్టింగ్ ఐఎన్టీయుసి ఎడబ్ల్యుఎస్ కంపెనీలో గంజాయిని దగ్ధం చేయించారు. దహనం చేయబడిన గంజాయి విలువ రూ.4 కోట్ల మేర ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనాలు వేశారు.పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 కేసుల్లో 1036.43 కిలోల గంజాయి, అశ్వరావుపేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో 2.8 కిలోల గంజాయి, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసుల్లో 25.9 కిలోల గంజాయిని దగ్ధం చేయించారు. మొత్తం 22 కేసుల్లో 1065.13 కిలోల గంజాయిని దహనం చేశారు. అసిస్టేంట్ కమిషనర్తోపాటు ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య ఇతర సీఐలు, ఎస్త్సలు ఈ గంజాయి దహన కార్యక్రమంలో పాల్గన్నారు. ఆక్టోబరు 1న ఖమ్మంలో రూ. 2.80 కోట్ల విలువ చేసే 1,120 కిలో గంజాయిని కూడ దగ్ధం చేయించారు. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జి ల్లాలో రూ. 6.80 కోట్ల విలువ చేసే 2185 కిలోల గంజాయి దహనం చేసారు.

## బిఆర్ఎస్ నుండి 60 కుటుంబాలు కాంగ్రెస్ చేరిక

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, అక్టోబర్ 4(మనం న్యూస్):** మణుగూరు మండలం పగిడేరు పంచాయితీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పగిడేరు మాజీ సర్పంచ్ తాటి బిక్షం ఆధ్వర్యంలో 60 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్ఏ పాయం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పగిడేరు గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సాంబాయి గూడెం నుండి పగిడేరు గ్రామానికి 2 కోట్ల 20 లక్షలతో రోడ్డు వేపించానని గత నాయకులు పగిడేరు రోడ్డును పట్టించుకోక రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. మళ్లీ సాంబాయిగూడెం నుంచి పగిడేరుకు గ్రామానికి రోడ్డు మంజూరు చేయించానన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కాపాడుకునే బాధ్యత తానే చూసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, మాజీ సర్పంచ్ తాటి బిక్షం, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో 'ఖమ్మం జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం

**ఖమ్మం, అక్టోబర్ 4 (మనం న్యూస్):** తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య పర్యవేక్షణలతో ఖమ్మం జిల్లాలోని ప్రముఖుల వ్యాసాలతో త్వరలో ఖమ్మం జిల్లా సమగ్ర స్వరూపం పుస్తక సంకలనాన్ని తీసుకరానున్నట్లు కోర్ కమిటీ కన్వీనర్, ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కోర్ కమిటీ ఏర్పడినట్లు తెలిపారు. కన్వీనర్‌గా వురిమళ్ల సునంద, సభ్యులుగా సయ్యద్ షఫీ, నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ ఉంటారని తెలిపారు. ఖమ్మం జిల్లా నైసర్గిక స్వరూపం, ప్రాచీన చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, పర్యాటక ప్రదేశాలు, పురాతన దేవాలయాలు, సాగు, తాగునీటి వనరులు, వ్యవసాయం-అనుబంధ పరిశ్రములు, అడవులు, పారిశ్రామీకరణ, విద్యా, వైద్య రంగం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జిల్లా పాత్ర, జిల్లా అభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర, మహిళాభ్యుదయం, సాహిత్యాభివృద్ధి తదితర అంశాలపై ఈ పుస్తకంలో వ్యాసాలుంటాయని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని ప్రముఖులతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సునంద తెలిపారు.

# కొత్త వేతనాల సాఫ్ట్ కాపీని అందించడానికి యాజమాన్యం చొరవ తీసుకోవాలి

- హరి పచౌరి ,కమీషనర్
- మనం వార్తా కథనానికి స్పందన

**మంచిర్యాల, అక్టోబర్ 4 (మనం న్యూస్):** సిఎంపిఎఫ్ కార్యాలయం అందించిన ప్రొఫార్మా ప్రకారం రిటైర్డ్ కార్మికుల పాత వేతనాలు 11 వేతన ఒప్పందం ప్రకారం కొత్త వేతనాల సాఫ్ట్ కాపీని అందించడానికి యాజమాన్యం వేగంగా చొరవ తీసుకోవాలని అపుడే 11 వేతన ఒప్పందంలో రిటైర్ అయిన కార్మికులకు కొత్త పెన్షన్ , వాటి బకాయిలను తాము చెల్లించడానికి వీలవుతుందని గోదావరిఖని సిఎంపిఎఫ్ .ఆఫీస్ కమీషనర్ హరి పచౌరి స్పష్టం చేశారు. మనం పత్రికలో గురువారం ప్రచురితం అయిన నెలలు గడుస్తున్న అందని 11 వేతన ఒప్పందం పెన్షన్ వాటి బకాయిలు వార్తా కథనం పై అయన స్పందన తెలిపారు. ఈ విషయం పై రెండు, మూడు రోజులల క్రితం సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్యతో చర్చించి నట్లు తెలిపారు . సింగరేణి యాజమాన్యం సాఫ్ట్ కాపీలో డేటాను అందించడానికి మేము సింగరేణి అధికారులను కూడా అభ్యర్థించామన్నారు .సమస్యపై సింగరేణి అన్ని ప్రాంతాల నుండి వేచి ఉన్నమని . ఫార్ములా ప్రకారం వివరాలు ,కాగితాలు తమ కార్యాలయానికి పంపాల్సి ఉందని అన్నారు. అంతే కాదు సెటిల్మెంట్ విషయం పై నాలుగు నెలల క్రితమే హైదరాబాద్లోని కార్పొరేట్ కార్యాలయం, సీఎండీ





## నెలలు గడుస్తున్న అందని 11వ వేతన ఒప్పందం పెన్షన్, వాటి బకాయిలు

**మొదటి పేజీ తరువాయి..** విరమణ పొందిన తేదీ నుంచి రావాల్సిన పెరిగిన పెన్షన్ బకాయిల గురించి ఎదురు చూస్తున్నారు. పదకొండవ వేతన ఒప్పందం బొగ్గులను కార్మికులకు 1,జూలై 2021 నుంచి 30, జూన్, 2026 వరకు కాలపరిమితి ఉంటుంది. ఈ ఒపందం 20,మే,2023 నాడు కుదరగా సింగరేణిలో 1,జూలై 2023 నుంచి అమలు చేశారు . ఇక ఈ వీటన పరిధిలో అనగా 1,జూలై 2021 నుంచి 20,జూలై ,2023 మధ్య మొత్తం సర్వీస్ చేసి గాని ఇతర కారణాలతో రిటైర్ అయిన వారికి కొత్త వేతనాల ప్రకారము కొత్త పెన్షన్, వాటికి సంబంధించిన బకాయిలు రావాల్సి ఉన్నది. ఈ వేతన పరిధిలో దాదాపు 3,300 వరకు రిటైర్డ్ కార్మికులు ఉన్నారు ఇప్పటివరకు పదవ వేతనముకు సంబంధించిన పాత పెన్షన్ తోనే వారి బతుకులను వెల్లదీస్తున్నారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన పెన్షన్ సెటిల్ చేస్తే రిటైర్డ్ కార్మికునికి ఒక వెయ్యి నుంచి నాలుగు వేల వరకు నెల పెన్షన్ పెరుగుతుంది . దాంతో పాటు దాదాపు 18 నెలల పెరిగిన పెన్షన్ బకాయిలు 40 వేల నుంచి 1 లక్షా 50 వేల వరకు బకాయిలు వాస్తాయి.వాటి గురించే రిటైర్ కార్మికులు ఎదురు చూస్తున్నారు. అయితే ఈ విశ్రాంతి కార్మికుల వేతన బకాయిలకు సంబంధించి పెన్షన్, వాటి బకాయిలకు సంబంధించిన విషయంలో సింగరేణిలో ఉన్న గుర్తింపు కార్మిక సంఘం కానీ, ప్రాతినిధ్య సంఘం కానీ ఇతర జాతీయ సంఘాలు కానీ స్పందించడం లేదు సరి కదా పట్టించుకోవడంలేదని తమను మర్చిపోయారా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సుదీర్ఘకాలం సింగరేణిలో పనిచేసి సేవలందించిన తమ పట్ల కనికరం చూపాలి కానీ ,ఇంత నిర్లక్ష్య వైఖరి సబబు కాదని, తమకు న్యాయంగా రావలసిన పెరిగిన పెన్షన్, దాని తాలూకు బకాయిలను ఇప్పించాలని గుర్తింపు , ప్రాతినిధ్య కార్మిక సంఘాలను, సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు. కాగా ఈ పెరిగిన పెన్షన్ విషయంపై గోదావరిఖని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం కమిషనర్ పచోరిని వివరణ కోరగా, సింగరేణి యాజమాన్యం నుంచి రిటైర్డ్ అయిన కార్మికుల సంబంధించిన పెరిగిన వేతనాల పట్టిక, వారి బ్యాంక్ అకౌంట్, ఆధార్ ,ఇతర కార్యాలయం కోరిన సర్టిఫికెట్లను సింగరేణి యాజమాన్యం తమ కార్యాలయానికి ఎంత తొందరగా పంపితే అంత తొందరగా తమ సిబ్బందితో పనిచేయిస్తామని, త్వరగా రిటైర్ కార్మికులకు పెరిగిన పెన్షన్, వాటి బకాయలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

మనం https://www.manamepaper.com/clip/19768
Karimnagar (3-10-2024)

కార్యాలయంతో సహా సంబంధిత అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

## అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

- ఎంపీడీవో ప్రాంగణంలోనీ ఎంఆర్సి కేంద్రంలో డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** డీఎస్సీ పరీక్షలు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ రెండు రోజులలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని ఎంపీడీవో ప్రాంగణంలోనే ఎం.ఆర్.సి కేంద్రంలో డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. మన జిల్లాలో 93 పోస్టులకుగాను 1:3 రేషియో క్రింద ఎంపిక చేసిన 202 డీఎస్సీ అభ్యర్థుల వెరిఫికేషన్ కోసం 6 కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఎస్సీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం 1:3 రేషియోలో అభ్యర్థులను ఎంపిక చేసిందని, పెద్దపల్లి జిల్లా పరిధిలో 202 మంది అభ్యర్థులు ఎంపిక అయ్యారని , ఇప్పటి 177 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిందని, మిగిలిన 25 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అక్టోబర్ 5 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నియామకాల్లో మాదిగలను మోసం చేస్తే సహించం

**పెద్దపల్లి, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని, అవసరమైతే అందుకోసం ఆర్డినెన్సు తీసుకువస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చి రెండు నెలలు కాలయాపన చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలను మోసం చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా ఈ నెల 9న పెద్దపల్లి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు మంథని చందు మాదిగ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థి విభాగం, నిరుద్యోగులు నిరాసన ప్రధర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారప్రతినిధి పొట్ల రమేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు అంబాల నరేష్, పల్లె బాపు, మడిపల్లి దశరతం, కొంద్ర వివేక్, దాసరి కిషన్, బచ్చల రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రత్యేక అధికారులు విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- బతుకమ్మ, దసరా వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** బతుకమ్మ దసరా పండుగలు వస్తున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు వారి విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.శుక్రవారం పెద్దపల్లి లోని నందన గార్డెన్స్లో బతుకమ్మ వేడుకలు, గ్రామపంచాయతీ విధులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పెద్దపల్లి నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూతెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధంగా ముఖ్యమైన పండుగ బతుకమ్మ అని, ప్రతి గ్రామంలో ఈ వేడుకలు ఘనంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రత్యేక అధికారులు శ్రద్ధతో చేపట్టాలని అన్నారు. బతుకమ్మ, దసరా వేడుకల నేపథ్యంలో గ్రామాలలో అవసరమైన లైటింగ్, బతుకమ్మ ఆట స్థలాలను శుభ్ర పరచడం, బతుకమ్మ నిమజ్జనం చేసే చోట లైటింగ్, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను ప్రత్యేక అధికారులు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎటువంటి కోతలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిధులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని, బతుకమ్మ వేడుకలలో ఎటువంటి లోటు ఉంచడానికి వీలులేదని అన్నారు. రూరల్ ప్రాంతాల్లో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపిఓ ప్రతి రోజు ఉదయం 9 గంటలకు క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, ప్రతి రోజు చెత్త సేకరించి సెగ్రిగేట్ చేయాలని, సీగ్రేషన్ షెడ్ ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెగ్రిగేషన్ షెడ్ వినియోగం పై అక్టోబర్ 25 నుంచి 30 వరకు స్పెషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తెలపడం జరిగిందని. గ్రామాలలో ఎక్కడ ప్లాస్టిక్ చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి సి-సెక్షన్ ఆపరేషన్కు ఆడిట్ ఫాం నమోదు చేయాలి

- అధికంగా సి సెక్షన్ చేస్తున్న ఆసుపత్రుల తనీఖీ
- సి సెక్షన్ ప్రసవాలను 60 శాతానికి తగ్గించాలి
- సి సెక్షన్ ప్రసవాల నియంత్రణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, అక్టోబర్ 4 (మనం ప్రతినిధి):** జిల్లాలో జరిగే ప్రతి సి- సెక్షన్ ప్రసవానికి సంబంధించి ఆడిట్ ఫాం నమోదు చేయాలని, సి- సెక్షన్ ఆపరేషన్ నియంత్రణకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సి- సెక్షన్ ప్రసవాల నియంత్రణ పై ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్ట్ డాక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన పెద్దపల్లి జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులలో 90 శాతం సి- సెక్షన్ ప్రసవాలు జరుగుతున్నాయని, వీటిని 60 శాతానికి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులలో 70 శాతం కంటే తక్కువ సి- సెక్షన్ ప్రసవాలు జరుగుతుండగా, మరికొన్ని ఆస్పత్రులలో 100 శాతం అవుతున్నాయని, సి- సెక్షన్ ఆపరేషన్ రేట్లు తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి సి- సెక్షన్ ఆపరేషన్ సంబంధించి కేసు వివరాలను ఆడిట్ ఫామ్ నింపాలని అన్నారు. అధికంగా సి- సెక్షన్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేసి సి- సెక్షన్ ఆపరేషన్ ఆడిట్ చేస్తాయని అన్నారు. సి- సెక్షన్ ద్వారా ప్రసవాలు చేసే సమయంలో తగిన ప్రోటోకాల్ పాటించాలని, ప్రోటోకాల్ ప్రకారం ఫోటోగ్రఫీ ఇతర స్టెప్స్ ను రికార్డ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అనవసరపు సి- సెక్షన్ ఆపరేషన్ జరగడానికి ఎట్టి పరిస్థితుల్లో వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గర్భిణీ మహిళలను సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహించాలని, సాధారణ ప్రసవం జరిగేందుకు పాటించాల్సిన పద్ధతుల పై వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అంతకుముందు అనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనేమియా నివారణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు , ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

# సింగభూపాలెం చెరువు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- చెరువు సుందరీకరణ, అభివృద్ధికి రూ.8.50కోట్లు మంజూరు
- ప్రతి ఎకరానికి పంట నీరు అందిస్తాం
- సీతారామ ప్రాజెక్టు నీళ్లు నియోజకవర్గ రైతులకు అందించాల్సిందే
- చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో కూనంనేని



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (మనం ప్రతినిధి):** కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు అభివృద్ధికి, సుందరీకరణ కోసం 8.50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువులో ప్రభుత్వం నుండి వంద శాతం ఉచితంగా ఒక లక్ష చేప పిల్లలను వారి చేతుల మీదగా చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ సింగభూపాలెం చెరువు కాకతీయుల నాటి పురాతనమైన చేరువని, ఈ చెరువు ఆధారంగా వేలందిమంది రైతులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. సీతారామసాగర్ నీటి ద్వారా ఈ ప్రాంతంలో 2000 ఎకరాలకు నియోజవర్గం మొత్తం 25 వేల ఎకరాల సాగునీరు అదనంగా అందించడం కోసం కృషి జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిలో భద్రాద్రి జిల్లాలను, కొత్తగూడెం నియోజకవర్గాన్ని వదిలి సీతారామప్రాజెక్టు నీళ్లు ఇతర ప్రాంతాలకు వెళ్లనీయమన్నారు. రైతులకు నీటి వసతి చాలా ప్రధానమైనదని రెండు పంటలకు నీరు అందించడం కోసం ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖ మంత్రులతో మాట్లాడి నియోజవర్గం మొత్తం నీటి సమస్యలు లేకుండా చెరువులు కాలువల అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామని కాలువలు అభివృద్ధి కోసం సుమారు వంద కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే టెండర్లను పిలవడం జరుగుతుందన్నారు. సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్ నాయకులగూడెం, కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, లక్ష్మీదేవిపల్లి, గ్రామపంచాయతీలను కార్పొరేషన్లో విలీనం చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియవల్ల ఎవరికి ఎలాంటి నష్టం జరగదని, మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె షాబీర్ పాషా, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమంతరావు, మత్స్యశాఖ అధికారి డిడి ఖదీర్ అహ్మద్, మత్స్య శాఖ జిల్లా అధికారి ఇంతియాజ్, జిల్లా అధ్యక్షులు బుచ్చన్న, ఇరిగేషన్ ఈ ఈ అర్జున్, డి ఈ భాస్కర్, డిప్యూటీ తాసిల్దార్ కూచిపూడి నాగరాజు, ఎంపీఓ శ్రీనివాస్, ఏవో నర్మదా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నిలోఫర్, ఏఈ కార్తీక్, సిపిఐ జిల్లా నాయకులు సభ్యులు భూక్య దస్రు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, స్థానిక నాయకులు తాళ్లూరు పాపారావు ధర్మారావు, తాళ్ల వెంకటేశ్వర్లు, వీర్ల దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, మేకల వెంకటేష్, దండు సురేష్, దండి నరసింహారావు, వివిధ శాఖల అధికారులు రాజకీయ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లచ్చయ్యకి నివాళులర్పించిన తాజా మాజీ జడ్పిటిసి పుల్లెంల సైదులు

**మాడుగులపల్లి, అక్టోబర్ 4(మనం న్యూస్):** మాడుగులపల్లి మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బొల్లెంపెల్లి లచ్చయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాడుగులపల్లి తాజా మాజీ జడ్పిటిసి పుల్లెంల సైదులు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట ఎరుకల వెంకన్న గౌడ్, బెల్లి జానయ్య, కె నాగిరెడ్డి, కె జనాయ్య, సైదులు, సుధాకర్, దుర్గారెడ్డి, దుర్గయ్య, ఆంజనేయులు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టరేట్ సాధించిన అధ్యాపకుడు



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్ పూర్ పెద్దపల్లి జిల్లాలో ఎకనామిక్స్ అధ్యపకుడిగా పని చేస్తున్న జాలిగం రమేష్ డాక్టరేట్ సాధించారు. ఆయన కాకతీయ విశ్వవిద్యా లయంలో ప్రొఫెసర్ ఎన్ విజయ పర్యవేక్షణలో తెలంగాణలోని పాక్షిక శుష్క మండ లాల్లో నీటి పారుదల, యాంత్రీకరణ మరియు వ్యవసాయ వృద్ధి అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన పరిశోధన కు కే యూ సి ఓ ఈ నర్సింహ చారి ఓ ప్రకటనలో తెలిపారు.

## హన్మంతునిపేట భజన మండలికి నేషనల్ యూనికాన్ అవార్డు



**పెద్దపల్లి, అక్టోబర్ 4 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామానికి చెందిన శ్రీ రామకృష్ణ భజన మండలికి నేషనల్ యునికాన్ అవార్డు – 2024 దక్కింది. ఏపీ తిరుపతిలో స్వరవాని కల్చర్ అకాడమి, స్నేహ్ కల్చర్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నైపుణ్య ప్రదర్శనతో శ్రీ రామకృష్ణ భజన మండలి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భజన మండలి సభ్యులకు మేడగోని శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డులను అందించి అభినందించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు నాగల మల్లాల వెంకటేశం, బయ్య కొమురయ్య, కారుపాకల కనకయ్య, సత్యం, ఆరేపల్లి రాయలింగు, కందుల గురుస్వామి, కంది చంద్రయ్య, గుర్రాల శంకర్, యాదగిరి రమేష్, చేరాలు, అడప సతీష్, బాల్సాని శంకర్, సురభి నందరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గోదావరి అర్బన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎంఎల్ఏకి ఘన సన్మానం



**పెద్దపల్లి, అక్టోబర్ 4 (మనం ప్రతినిధి):** గోదావరి అర్బన్ బ్యాంక్ పెద్దపల్లి బ్రాంచికి తొలిసారిగా విచ్చేసిన పెద్దపల్లి ఎంఎల్ఏ చింతకుంట విజయ రమణారావు కు బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేష్ ఘనంగా సన్మానించారు. పెద్దపల్లి బ్రాంచి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఎంఎల్ఏకి బ్యాంక్ సిబ్బంది పులబొకె అందచేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గత కొన్ని సంవ్సరాలుగా సేవాలు అందిస్తూ కస్టమర్ విశ్వాసాన్ని చూరగొంటూ మెరుగైన సేవలు అందిస్తునదుకు బ్యాంక్ సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ డాక్టర్ వేంకటేశ్వర రావు కొమ్ము కరుణాకర్ బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేష్, నాగుల రమేష్,తిరుమల, సరిత,భార్గవ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు

- పుల్లెంల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్



**చండూరు, అక్టోబర్ 4 (మనం న్యూస్):** చండూర్ మండలం పుల్లెంల గ్రామంలో ఎస్సీ కాలనీలో త్రాగునీటి సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన పుల్లెంల కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్ స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే మిషన్ భగీరథ వెంకటేశ్వర్లు త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కారించాలని మాట్లాడారు స్పందించిన ఆర్.డబ్ల్యూ.ఎస్ రామచంద్రయ్య శుక్రవారం పుల్లెంల గ్రామంలో పర్యటించారు ఎస్సీ కాలనీలో త్రాగునీటి సమస్యను ప్రజలను అడిగి తెలుసుకున్నారు ప్రతిరోజు త్రాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు. త్రాగునీటి కి శాశ్వత పరిష్కారం కావాలంటే ఎస్సీ కాలనీలో (ఓహెచ్ఎస్ఆర్) ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని పరిష్కారం చూపుతామని తెలిపారు. వారితో పుల్లెంల మాజీ ఎంపీటీసీ సీత యాదయ్య ,కార్యదర్శి ప్రభువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. త్రాగునీటి సమస్య పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన పుల్లెంల గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్.

మనం
Follow : @Manamnews



# సాగర్‌లో ఇళ్ల నిర్మాణాలు సక్రమమా అక్రమమా

- సాగర్‌లో ఇళ్ల నిర్మాణం సక్రమమైతే ఎటువంటి నిబంధనలు పాటించాలి
- సాగర్‌లో ఇళ్ల నిర్మాణం అక్రమం అయితే ఎటువంటి నిబంధనలు పాటించాలి
- ప్రస్తుతం సాగర్‌లో కడుతున్న ఇల్లు అన్ని సక్రమమైనవేనా

**నాగార్జునసాగర్, అక్టోబర్ 4 (మనం న్యూస్):** నందికొండ మున్సిపాలిటీ పైలాన్ కాలనీ కి చెందిన ముడావత్ లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిని మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం హటాత్తుగా కూల్చివేశారు.కావాలనే ఉద్దేశపూర్వకంగా తన జాగాలో నిర్మాణం చేపడుతున్న ఇంటిని మున్సిపల్ కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఎటువంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా తమ సిబ్బందితో వచ్చి కూల్చివేయడం అమానుషం అని అక్రమ నిర్మాణాల పేరిట కూల్చివేతలలో కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని కౌన్సిలర్ రమేష్ జి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన కట్టడాలు సక్రమమైనప్పుడు ఇప్పుడు కడుతున్న కట్టడాలు అక్రమం ఎలా అవుతాయని



సాగర్‌లో అక్రమ కట్టడాలు ఎన్నో ఉనన్నా ముఖ్యంగా నందికొండ మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ ఎదురుగా అక్రమ కట్టడాలు ఎన్నో కడుతున్న పట్టించుకోని కమిషనర్ పేదవాడైన తమ ఇంటిని కూల్చివేయడం ఏమిటని ఇంటి యజమాని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికితీసుకువెళ్తామని వారుఅన్నారు..

### అందుబాటులో ఉండని కమిషనర్ దండు శ్రీను

సదరు కట్టడాలను కూల్చివేత విషయమై ఏమైనా అనుమతులు ఉన్నాయా అని విలేకరులు స్థానిక మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనును వివరణ కోరదామన్నా అందుబాటులో ఉండడు ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడు సమాధానం చెప్పడు.మరి దీనిని బట్టి అతను బడా బాబుల విషయంలో తలదూర్చకుండా పేదల కట్టడాల కూల్చివేత విషయంలో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడని అనుకోవాలా.

### కూల్చివేతల పర్వం కొనసాగేనా?

నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇలా అక్రమ కట్టడాలు అనేకం ఉన్నాయి అవన్నీ ప్రభుత్వ అనుమతులు లేకుండా కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలను చేపట్టడం గత దశాబ్ద కాలంగా కొనసాగుతూ వస్తుంది. గతంలో అక్రమార్కులు కనిపించిన ఖాళీ స్థలాలను ఎక్కడికక్కడ ఆక్రమించి సొమ్ము చేసుకున్నారు. లక్షల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలను ఇలా ఆక్రమించి అమ్ముకుంటుంటే అధికార యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లు ఉండడం గమనార్హం. నాగార్జునసాగర్ ని మున్సిపాలిటీగా ప్రకటించినప్పటి నుండి సాగర్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విలా సవంతమైన జీవనం గడపడానికి సాగర్ లోని స్థలాలను ఆక్రమించి ఆటవిడుపు కోసం ఏదేచ్ఛగా బహుళ అంతస్తుల బిల్డింగ్ లు కడుతున్నారు. ఈ కూల్చివేతలు అనేవి అక్రమంగా నిర్మించిన అన్ని నిర్మాణాలకు వర్తిస్తుందా, అక్రమ నిర్మాణాల విషయంలో ఈ కూల్చివేతల పర్వం ఎంతవరకు కొనసాగుతుందో వేచి చూడాలి.

## కౌన్సిలర్ శంకర్ నాయక్‌ని పరామర్శించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 04 (మనం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ తల్లి కొర్ర లక్ష్మి భాయి ఇటీవల మరణించగా మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం వారి నివాసానికి వెళ్ళి లక్ష్మి బాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభుతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మోహన్ నాయక్, వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, సంజీవ్, వినోద్, ప్రవీణ్ నాయక్, హనుమంత్ నాయక్, కుమార్ నాయక్, దశరథ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ వాహనాన్ని ఢీకొన్న ద్విచక్రవాహనం



**చిట్యాల, అక్టోబర్04 (మనం న్యూస్) :** సీఐ వాహనానికి ఓ ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం టేకుమట్ల మండలంలోని గరిమిళ్ళపల్లి గ్రామానికి చెందిన పుప్పాల నర్సయ్య,విజయ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్నారు. స్టానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని చౌరస్తా నుంచి రామచంద్రపురం వైపుగా సిఐ వాహనం వెళ్తోంది. ఈ క్రమంలో నర్సయ్య ద్విచక్ర వాహనం సీఐ వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో నరసయ్య, విజయ తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే సిఐ మల్లేష్ యాదవ్ ప్రవేట్ వాహనంలో గాయాలైన ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ప్రధమ చికిత్స చేసిన అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

## కృష్ణానదిలో తండ్రి అస్తికలు కలిపిన మంత్రి ఉత్తమ్



**హుజూర్ నగర్, అక్టోబర్ 04, (మనం న్యూస్) :** ఇటీవల రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి దివంగత నలమాద పురుషోత్తంరెడ్డి దివంగతులైన విషయం విదితమే. శుక్రవారం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలో అత్యంత పురాతనమైన మట్టపల్లి శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రవహిస్తున్న కృష్ణానది సంఘమంలో అపరాండం వేళా శాస్త్రయుక్తంగా తన తండ్రి అస్తికలను కలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ వెంట ఆయన సోదరుడు, కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## దసరా పండుగ ముందే అంగన్‌వాడీలకు జీతాలు జమ చేయండి

- ఆడెపు వరలక్ష్మి




**నల్లగొండ, అక్టోబర్ 04 (మనం న్యూస్):** అంగన్వాడీ లకు అక్టోబర్‌లో జమ అయ్యే సెప్టెంబర్ నెల వేతనం దసరా పండుగ ముందే జమ చేయాలని మహిళ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కు ఆన్లైన్ లో వినతి పత్రం పంపించిన (మినీ) అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి. ఈ జీతాల మీద నే ఆధారపడి బతికే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి,వరుసగా బతుకమ్మ,దసరా పండుగ లు ఉండడంతో ఆర్థికంగా అంగన్వాడీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని,అప్గ్రేడ్ అయిన (మినీ) అంగన్వాడీ లకు ఈ నెల పూర్తి వేతనాన్ని జమ చేయాలని,ఇటీవలే మంత్రి సీతక్క పెండింగ్ వేతనాలు త్వరగా జమ చేస్తామని హామీ ఇచ్చారని,పూర్తి వేతనాన్ని కూడా జమ చేయాలని ఒక్క ప్రకటనలో తెలిపారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అర్థ వార్షిక ఆదాయం 1436 కోట్లు

- రాష్ట్ర ఆదాయంలో 45% ఉమ్మడి రంగారెడ్డి జిల్లా
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమీషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్



**రంగారెడ్డి, అక్టోబర్ 4 (మనం న్యూస్) :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి,వికారాబాద్ జిల్లాలో సంయుక్తంగా 1436 కోట్లు ఆదాయాన్ని సాధించాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమీషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ వెల్లడించారు. శుక్రవారం 3 జిల్లాల రవాణా శాఖ అధికారుల తో నిర్వహించిన సమీక్షా సమావేశం లో చంద్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ...జిల్లాల పరంగా రంగారెడ్డి జిల్లా 802 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరి 595 కోట్లు వికారాబాద్ 39 కోట్లు కలిపి 1436 కోట్ల ఆదాయం సాధించడం జరిగిందని తెలిపారు.ఈ ఆదాయం రాష్ట ఆదాయం 3195 కోట్ల లో 45%ఆదాయం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దేనని తెలిపారు. త్రైమాసిక పన్నుల ద్వారా 161 కోట్లు, జీవిత కాలపు పన్నుల ద్వారా 1120 కోట్లు ఫీజుల ద్వారా 92 కోట్లు సర్వీస్ ఛార్జీ ల ద్వారా 21 కోట్లు గ్రీన్ టాక్స్ ల ద్వారా 10 కోట్లు తనిఖీ ల ద్వారా 32 కోట్లు మొత్తం 1436 కోట్ల ఆదాయాన్ని సాధించినట్లు చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు.త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని లేని పక్షంలో తనిఖీలలో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడం తో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు. ఓవర్ లోడ్ తో తిరిగే వాహనాల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ 2024-25 లో ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ రోజు నిర్వహించిన సమీక్షా సమావేశం లో వివిధ జిల్లాల రవాణా శాఖ అధికారులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్,శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.మొత్తం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్థ వార్షిక ఆదాయ లక్ష్యం 1792 కోట్లు కాగా 1436 కోట్లు అనగా 80% ఆదాయ లక్ష్యాన్ని సాధించినట్లు చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

## మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- తెలంగాణా మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్ (బాలన్న)

**రంగారెడ్డి, అక్టోబర్ 4 (మనం న్యూస్) :** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించలని తెలంగాణా మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్ (బాలన్న) అన్నారు. కార్మిక పక్షపాతి దేశంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం బాబాసాహెబ్ మార్గం లో పోరాడిన మాహా నేత, హైద్రాబాద్ మహానగరంలో వేలాది మంది పేదలకు సొంత ఇంటి కోసం పోరాడిన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో పోరాడటంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ సభ్యులుగా కీలక పాత్ర పోషించి తెలంగాణా రాష్ట్రం ఇవ్వాలని సోనియా గాంధీ ని ఒప్పించి తెలంగాణ ఇప్పించిన సాధకుడు దివంగత మహానే జి. వెంకటస్వామి 95 వ, జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని తెలంగాణా మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్లు బేర బాలకిషన్ (బాలన్న) మేక వెంకన్న




బూర్గుల వెంకటేశ్వర్లు గోపోజు రమేష్ తదితరుల తో కలిసి దిల్సుఖ్నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కోరారు. అదేవిధంగా హైదరాబాద్ సాగర్ పార్క్ వద్ద ఉన్న కాక విగ్రహం వద్ద రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి కాక అభిమానులంతా హాజరై ఘననివాలులు అర్పించాలని చెన్నయ్య కోరారు.

# నిత్యావసర సరుకుల జీరో దందా

- పట్టించుకోని అధికారులు



**టేకుమట్ల, అక్టోబర్ 4 (మనం న్యూస్):** మండలంలో నిత్య అవసర సరుకుల జీరో దందా జోరుగా కొనసాగుతోంది ఏ గ్రేడ్ సరుకులు అని చెప్పేసి సీ గ్రేడ్ సరుకులు అమ్మకాలు చేస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వాలు నూనెల ధరలు విపరీతంగా పెంచింది ప్రజల పైన భారం మోపింది.ప్రజలు విలువలాడుతున్న సమయంలో నిత్యవసర సరుకులు జీరో సరుకులు తెచ్చి అదే ధరకు అమ్ముతుంటే తనిఖీ చేయవలసిన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూన్నారు అని అన్నారు. తక్షణమే అతని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.నిరుపేదలు పండుగ పూట చిల్లర సరుకులు కొంటే నాణ్యత లేకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పెరిగిన ధరలను తగ్గించాలని అన్ని కిరణం షాపులలో ఒకే దరకు అమ్మకుండా ఒక్కొక్క షాపు ఒక్కొక్క రకంగా అమ్ముకుంటూ నిరుపేదలను మోసం చేస్తూ పండుగ పూట నిరుపేదలు సరుకులు కొనాలంటే కొనలేని పరిస్థితి దాపురించింది కావున తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సిపిఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు కసర వేణు కుమార్ ,సాద శ్రీనివాస్ ,విజయ్ పాల్గొన్నారు.

# ఆరోగ్య భద్రతనిచ్చేది... సీఎం సహాయ నిధి



- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 04 (మనం న్యూస్):** ఆరోగ్య భద్రతనిచ్చేది సీఎం సహాయ నిధని ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ కు చెందిన టి.వెంకటేశ్వర్లు, కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లికి చెందిన ఎన్.లక్ష్మినారాయణ లకు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి టి.వెంకటేశ్వర్లు తండ్రి టీ బాలేశ్వరయ్య (రూ.1,10,000/-), ఎన్.లక్ష్మినారాయణ తండ్రి ఎన్. వీర రాజు (రూ.2,75,000/-) లకు ఎల్ఓసీ మంజూరు చేయించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దుందిగల్ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు పడాల మనోజ, సీనియర్ నాయకులు శ్రీనివాస్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కారు అదుపు తప్పి కల్వర్టును ఢీ కొని వ్యక్తి మృతి



**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 4 (మనం న్యూస్):** కారు అదపు తప్పి కల్వర్టును ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల స్టేజీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం..........నూతనకల్ మండలం పెద్దనెమిల గ్రామానికి చెందిన రేసు రాములు (49) ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అంజమ్మ మనవరాలుకు గాయాలు కాగా సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబం కొంత కాలంగా సూర్యాపేటలో నివాసం ఉంటున్నారు. కారులో తుంగతుర్తిలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి సూర్యాపేటకు వెళ్లేక్రమంలో ప్రమాదం జరిగింది. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తుంగతుర్తికి వెళ్లి వస్తు సంఘటన స్థలంలో ఆగి వివరాలు తెలుసుకున్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 4 (మనం న్యూస్):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు ఈర్ల సైదులు అన్నారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాటి నాగరాజు, మాగి శంకర్, గడ్డం ఉదయ్, శ్రీకాంత్, వేడిపల్లి వేణు, మంజులు, రాధ, స్రవంతి, శిరిష తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**తిరుమలగిరి, అక్టోబర్ 04 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన వేముల జలేందర్ మంజూరైన సీఎం సహాయనిధి రూ. 23500 చెక్కును అతని తండ్రి శ్రీశైలంకు ఎమ్మెల్యే మందుల సాములు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈకార్యక్రమంలో జుమ్మిలాల్, కందుకూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మనం

శనివారం | అమరావతి
05 | 10 | 2024







## ప్రజలందరూ ఏకమవ్వాలి

**జైపూర్, అక్టోబర్ 4 :** నిత్యం సంఘర్షణలతో, హింసాత్మక ఘటనలతో ప్రపంచంలోని పలు ప్రాంతాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ శాంతి, ఐక్యతలను సాధించాల్సిన ఆవశ్యకత నేడెంతో ఏర్పడిందని తెలిపారు. మౌంట్ అబూలోని బ్రహ్మకుమారీల అంతర్జాతీయ ప్రధాన కార్యాలయంలో 'పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజానికి ఆధ్యాత్మికత'పై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. తీవ్ర అశాంతి నెలకొన్న ప్రపంచంలో మానవీయ విలువలూ మృగ్యమవుతున్నాయని ముర్ము పేర్కొన్నారు. మనసు అంతరాళంలో శాంతి కొలువుదీరి ఉంటుంది కనుక ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని, వచనాలను, క్రియలను పరిశుద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కాలుష్యం, భూతాపం వంటి సవాళ్లను అధిగమించడానికి ప్రజలందరూ ఏకమవ్వాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. 'భూమికి యజమానులు ఎవరూ కాలేరు. మనందరం ధర్మకర్తలం మాత్రమే. విచక్షణతో ధరణిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనదే'నని ముర్ము స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని విజ్ఞప్తి చేశారు.

# 140 కోట్ల మంది విశ్వాసమే మన బలం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 :** ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని చెప్పారు. కౌటిల్య ఆర్థిక సదస్సులో ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని అభిప్రాయపడ్డారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భౌగోళిక అత్యవసర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రపంచమంతా భారత్ గురించి మాట్లాడుతుందంటే.. ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామన్నారు. అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదేనని ప్రధాని మోదీ అన్నారు. మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. సంస్కరించు, పనితీరు మెరుగుపరుచు, రూపాంతరం చెందు అనేది తమ ప్రభుత్వం నిత్యం పటించే మంత్రమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం; జీఎస్టీని తీసుకురావడం; దివాలా స్మృతి; గనులు, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం; ఎఫ్డీఐ నిబంధనలు సరళీకరించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## భారత్‌కు మాల్దీవుల అధ్యక్షుడు..

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 :** మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు భారత్ పర్యటనకు వస్తున్నారు. ద్వైపాక్షిక సంబంధాల కోసం ఆయన ఇండియాలో తొలి పర్యటన చేయబోతున్నారు. జూన్‌లో ప్రధాని మోడీ ప్రమాణస్వీకారానికి వచ్చి వెళ్లిపోయారు. ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాల కోసం భారత్లో పర్యటించబోతున్నారు. అక్టోబర్ 6 నుంచి 10 వరకు ఇండియాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా భారత్లోని పలు ప్రాంతాలను సందర్శించనున్నారు. ప్రధాని మోడీ లక్షద్వీప్ పర్యటన తర్వాత మాల్దీవుల మంత్రులు ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తెగిపోయాయి. అంతేకాకుండా భారతీయులు మాల్దీవులు వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచి మాల్దీవుల పర్యాటకం తీవ్రంగా దెబ్బతింటూ వస్తుంది. అంతేకాకుండా ముయిజ్జు.. చైనాకు అనుకూలంగా వ్యవహరించడం కూడా భారతీయులకు రుచించలేదు. దీంతో మాల్దీవుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇక గత్యంతరం లేక ముయిజ్జు భారత్‌తో సంబంధాలు పెంచుకునేందుకు తహతహలాడుతున్నారు. దాదాపు ఐదు రోజుల పర్యటన కోసం ముయిజ్జు భారత్‌కు వస్తున్నారు. ఈ పర్యటనలో ప్రాముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు.

మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు అక్టోబర్ 6 నుంచి 10 వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. భారత్‌లో తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొంది. పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కూడా సమావేశమం కానున్నారు. పర్యటనలో ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రధాని మోడీతో ముయిజ్జు చర్చలు జరపనున్నారు. ఇక వ్యాపార కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ముంబై, బెంగళూరు ప్రాంతాలను కూడా సందర్శిస్తారు.

భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవల మాల్దీవులను సందర్శించారు. అధ్యక్షుడు ముయిజ్జు గత సంవత్సరం నవంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్ నుంచి ఇదే తొలి పర్యటన. ఇరు దేశాల సంబంధాలపై చర్చించారు. ఇరు దేశాలు అభివృద్ధి సహకారాన్ని పంచుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

## నేడు హర్యానా పోలింగ్..

మొదటి పేజీతరువాయి...

మధ్య తీవ్ర పోటీ నెలకొంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఒకే విడతలో నేడు (సెప్టెంబర్ 5) పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తీసుకుని పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటున్నారు. ఇక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. హర్యానాలో కాంగ్రెస్-బీజేపీ పోటాపోటీగా ప్రచారం చేశాయి. మరొకసారి అధికారం కోసం బీజేపీ కృషి చేయగా.. అధికారం ఛేజిక్కించుకోవాలని కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నం చేసింది. అలాగే ఆప్ కూడా కొన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. కొన్ని స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ, అమిత్ షా, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే లాంటి ముఖ్యమైన నేతలంతా ప్రచారంలో దూసుకుపోయారు. రెండు పార్టీలు కూడా మాటల తూటాలు పేల్చుకున్నారు. ఇక భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ ఎన్నికల బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నిలబడ్డారు. ఇక హర్యానా ఎన్నికలు ముగియగానే ఎగ్జిట్స్ పోల్స్ విడుదల కానున్నాయి. జమ్మూకాశ్మీర్లో మూడు విడతలగా పోలింగ్ జరిగింది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. ఇక్కడ భారీగానే ఓటింగ్ నమోదైంది. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. మరీ ఈసారి ప్రజలు ఎవరికీ అధికారం కట్టబెట్టనున్నారో చూడాలి.


# రుణమాఫీ చేయడంలో సర్కార్ విఫలం

### రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు

### దసరా తర్వాత రాహుల్ ఇంటి ముట్టడి

### తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు

**మహబూబాబాద్, అక్టోబర్ 4 (మనం న్యూస్):** పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క- సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు. మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతు బంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. దసరా తర్వాత రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తం. రుణ మాఫీ అమలు చేయిస్తాం. ప్రజల సమస్యలు పక్కకు పోవాలని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నడు. రాష్ట్రంలో రౌడీయిజం నడుస్తున్నది. హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించా రు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్



నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్, అబద్దాలకోరు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శలు చేశారు. శుక్రవారం తొర్రూరులో ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహా ధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనా చారి, మాలోతు కవిత, రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకరరావు మాట్లాడుతూ... సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి అబద్దాలు ఎక్కువ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేసేదాక వదిలిపెట్టామని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.

# త్వరలో పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

### పలు మార్గాల్లో రైళ్ళను నడపడానికి ప్రణాళిక సిద్ధం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 :** భారత్‌లో హైడ్రోజన్‌తో నడిచే రైళ్లు త్వరలో పట్టాలెక్కనుంది. ఈ క్రమంలో.. జర్మనీకి చెందిన హైడ్రోజన్ రైలు భద్రతకు సంబంధించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించనుంది. ఈ రైలు ట్రయల్ రన్ డిసెంబర్ 2024లో ప్రారంభమవుతుందని సమాచారం. జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనాలో హైడ్రోజన్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా ఈ జాబితాలో చేరనుంది. హైడ్రోజన్ రైలు ఒక్క యూనిట్ ఖరీదు రూ.10 కోట్లకు పైగా ఉంటుంది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. రైల్వే మొదట 35 రైళ్లను నడపనుంది. ఒక్కో రైలుకు రూ.80 కోట్లు ఖర్చవుతుంది. దీని గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేయడానికి రూ.70 కోట్లు వెచ్చించనున్నారు. సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్ బ్యాటరీ, రెండు ఇంధన యూనిట్లను విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైలును మొదట జింద్-సోనిపట్ సెక్షన్‌లో నడపనున్నట్లు సమాచారం. హర్యానాలోని రైళ్లకు హైడ్రోజన్ జింద్‌లో ఉన్న పాలిమర్ ఎలక్ట్రోలైట్ మెమ్బ్రేన్ ఎలక్ట్రోలైజర్ నుండి అందించబడుతుంది. ఇక్కడ ప్రతిరోజూ దాదాపు 430 కిలోల హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. 3000 కిలోల హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం కూడా ఉంటుంది.హైడ్రోజన్ రైలు హైడ్రోజన్ ఇంధనంతో నడుస్తుంది. ఇందులో ఇంజన్ స్థానంలో హైడ్రోజన్ ఇంధన కణాలు అమర్చబడి ఉంటాయి. ఈ రైళ్లు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ లేదా పార్టిక్యులేట్ మ్యాటర్ వంటి కాలుష్య కారకాలను విడుదల చేయవు. దీని వల్ల కాలుష్యం ఉండదు. హైడ్రోజన్ ఇంధన కణాల సహాయంతో, హైడ్రోజన్ ఇంధనాన్ని ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయబడుతుంది. ఈ రైలును హైడ్రైల్ అని కూడా అంటారు. ఈ రైలులో నాలుగు కోచ్‌లు ఉండనున్నట్లు తెలుస్తోంది. నీలగిరి మౌంటైన్ రైల్వే, డార్జిలింగ్ హిమాలయన్, కల్కా సిమ్లా రైల్వే, కాంగ్రా వ్యాలీ, బిల్మోరా వాఘై మరియు మార్వార్ దేవ్‌గర్ మదారియా మార్గాల్లో ఈ రైలును నడపడానికి ప్రణాళిక ఉంది. ఈ రైలు గంటకు 140 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. ఈ రైలు కారుపాతల, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమవుతోంది. డీజిల్ రైలుతో పోలిస్తే ఈ రైలు నడపడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అయితే.. పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. గ్రీన్ హైడ్రోజన్ కిలోకు దాదాపు రూ.492 ఉంటుంది. ఈ రైలు నిర్వహణ డీజిల్ రైలు కంటే 27 శాతం ఖర్చుతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. ఫ్రెంచి కంపెనీ తొలిసారిగా హైడ్రోజన్ రైలును సిద్ధం చేసింది. 2018 నుంచి అక్కడ హైడ్రోజన్ రైలు నడుస్తోంది.

## శత్రువులను మట్టికరిపించి తీరుతాం

### ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వార్నింగ్

**టెహ్రాన్, అక్టోబర్ 4 :** ఇజ్రాయెల్, ఇరాన్ దూకుడుతో పశ్చిమాసియా దేశాల్లో హై టెన్షన్ నెలకొంది. ఇరు దేశాలు పరస్పరం మిస్సైళ్లు, బాంబుల వర్షం కురిపించుకుంటుడటంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉన్న క్రమంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ దేశ ప్రజలనుద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. శుక్రవారం సెంట్రల్ టెహ్రాన్లోని ఓ మసీదు వద్ద వేలాది మంది మద్దతుదారులను ఉద్దేశించి ఖమేనీ ప్రసగించారు. ఈ సందర్భంగా పాలస్తీనియన్లు, లెబనీస్ ఉద్యమాలకు మద్దతుగా మాట్లాడిన ఖమేనీ.. తమ శత్రువులను (ఇజ్రాయెల్) ఓడించి తీరుతామని ప్రతిజ్ఞ చేశారు. ఇజ్రాయెల్‌పై ఇటీవల ఇరాన్ చేసిన దాడులను సరైన చర్యగా ఆయన అభివర్ణించారు. లెబనీస్, పాలస్తీనియన్ల ఆక్రమణకు వ్యతిరేకంగా నిలబడిన తమపై అభ్యంతరం, నిరసన తెలిపే హక్కు ఏ అంతర్జాతీయ చట్టానికి లేదని ఖమేనీ స్పష్టం చేశారు. కాగా, హమాస్, హిజ్బొల్లా టాప్ లీడర్లను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. దీనికి ప్రతీకారంగా ఇటీవల ఇరాన్ ఇజ్రాయెల్‌పై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ చేసిన దాడికి బదులు తీర్చుకోవాలని ఇజ్రాయెల్ ఆగ్రహంతో ఊగిపోతోంది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఈ సమయంలో ఇజ్రాయెల్ ను ఓడించి తీరుతామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రతిజ్ఞ చేయడంతో ఈ దాడులు ఏ వైపునకు దారి తీస్తాయోనని పశ్చిమాసియాతో పాటు ప్రపంచ దేశాల్లో ఆందోళన నెలకొంది.

## కొండా సురేఖ ఆరోపణలపై రాహుల్ స్పందించాలి

### కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ డిమాండ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 :** మంత్రి కొండాసురేఖ వ్యాఖ్యలు, ఆరోపణలు పార్టీతో పాటు ప్రభుత్వాన్ని ఇరకటాంలోకి నెట్టేసినట్లున్నాయి. సినీ సెలబ్రిటీలు సమంత-నాగచైతన్య విడాకుల వ్యవహారంపై మంత్రి అనవసరంగా నోరుపారేసుకున్నారు. తనకు ఏమాత్రం సంబంధంలేని విషయాలపై కొండా సురేఖ పదేపదే ఆరోపణలు చేయటంతో ప్రతిపక్షపార్టీలకు కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వంపై దాడిచేయటానికి అస్త్రాలు ఇచ్చినట్లయ్యింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేయాలని అనుకున్న మంత్రి చివరకు రాజకీయాలతో ఎలాంటి సంబంధంలేని అక్కినేని కుటుంబం, సమంతపై తీవ్రమైన ఆరోపణలు చేసి రోడ్డుమీదకు లాగేశారు. బీజేపీ నేత, కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ ట్విట్టర్ వేదికగా రాహుల్ గాంధీకి వేసిన ప్రశ్నే నిదర్శనం. వైష్ణవ్ మంత్ర కొండా సురేఖ ఆరోపణలపై స్పందించాలని రాహుల్‌ను డిమాండ్ చేశారు. మంత్రి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని కేంద్రమంత్రి మండిపడ్డారు.

# రాష్ట్రంలో రెండ్రోజులు వానలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ..!!

**హైదరాబాద్, అక్టోబర్ 4 (మనం న్యూస్):** రాష్ట్రంలో రెండ్రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. శనివారం నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. హైదరాబాద్లో రెండ్రోజుల పాటు మబ్బు పట్టి ఉంటుందని, మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. పొద్దున ఎండ.. సాయంత్రం వానరాష్ట్రంలో పొద్దునంతా ఎండ కొట్టగా.. సాయంత్రం కాగానే ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ సిటీ సహా పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గురువారం నల్గొండ, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు



కురిశాయి. నిజామాబాద్, మెదక్, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. అత్యధికంగా నాగర్కర్నూల్ జిల్లా వేల్తూరులో 8.4 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో 7 సెంటీ మీటర్లు, ఎర్రారంలో 6.7, కోదండాపురంలో 6.3, నిర్మల్ జిల్లా అబ్దుల్లాపూర్లో 6.1, నల్గొండ జిల్లా చలకుర్తిలో 5 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ సిటీలో పలు చోట్ల మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. అంబర్‌పేటలో 2.3 సెంటీమీటర్లు, కంచన్‌బాగ్‌లో 2.1, ఆస్మాన్‌ఘర్లో 1.9, చంపాపేట్లో 1.9, హిమాయత్‌సాగర్లో 1.7, ఎల్బీనగర్‌లో 1.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయ్యింది. కాగా, ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో 40.9 డిగ్రీలు, సూర్యాపేట జిల్లాలో 40.6, కామారెడ్డి 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# దద్దరిల్లిన దండకారణ్యం

**చర్ల, అక్టోబర్ 4 (మనం న్యూస్) :** చత్తీస్గఢ్ దండకారణ్యం తుపాకుల మోతతో దద్దరిల్లింది. భద్రతా దళాలు- మావోయిస్టుల మధ్య రోజంతా జరిగిన ఎన్ కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్ కౌంటర్ల చరిత్రలోనే ఇది అతి పెద్దదిగా పోలీస్ వర్గాలు తెలిపాయి. చత్తీస్గఢ్ దండకారణ్యం రక్తమోడింది. శుక్రవారం దంతెవాడ - నారాయణ్ పూర్ సరిహద్దులోని అంబూజ్ మడ్ అడవులలో జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. మూడ్ అడవులలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో వందల మంది కోబ్రా, డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్ దళాలు అంబూజ్ మడ్ అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టాయి. మధ్యాహ్నం సమయంలో భద్రతా దళాలకు మావోయిస్టులు తారస పడటంతో ఇరు వర్గాల నడుమ భీకరంగా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పులలో 30మంది వరకు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. 14 మృత దేహాలను స్వాదీన పరుచుకున్నామని, మరి కొన్నిటిని స్వాదీన పరుచుకోవాల్సి ఉందని నారాయణ్ పూర్ జిల్లా ఎస్పి ప్రభాత్ కుమార్ వెల్లడించారు. ఘటనా స్థలం నుండి పెద్ద మొత్తంలో ఏకే 47లు సహా భారీగా ఆయుదాలు, మందుగుండు సామగ్రి భద్రతా దళాలు స్వాదీన పరుచుకున్నాయి. కాగా మావోయిస్టు చరిత్రలో ఇందే అతి పెద్ద ఎన్ కౌంటర్ గా భావిస్తున్నారు.

## కాంగోలో పడవ బోల్తా ఘటనలో 78 మంది మృతి

**కాంగో, అక్టోబర్ 4 :** మధ్య ఆఫ్రికా దేశమైన కాంగోలోని తూర్పు ప్రాంతంలోని కివు సరస్సులో గురువారం వందలాది మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ బోల్తా పడడంతో 78 మంది మరణించారు. ఈ మేరకు స్థానిక అధికారి ఒకరు సమాచారం అందించారు. ఘటన సమయంలో 278 మంది ఉన్నారని.. దక్షిణ కివు ప్రావిన్స్ గవర్నర్ జీన్-జాక్వెస్ పురుస్సీ తెలిపారు. ఘటనలో 78 మంది మరణించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. అంతకుముందు, బోటులో దాని సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. కిటుకు రేవుకు కొన్ని మీటర్ల దూరంలో పడవ మునిగిపోయింది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని మినోవా నుండి ఉత్తర కివు ప్రావిన్స్‌లోని గోమాకు పడవ ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇదివరకు జూన్‌లో రాజధాని కిన్షాసా సమీపంలో ఫెర్రీ మునిగిపోవడంతో 80 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు.

## చెలరేగిన తంజిమ్, లారా..

### మాజీ చాంపియన్‌కు ఘోర పరాభవం



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 వరల్డ్ కప్‌లో మరో సంచలన విజయం. ఎనిమిదేండ్లుగా ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న దక్షిణాఫ్రికా తొలి కప్ వేటను ఘనంగా మొదలెట్టింది. లీగ్ దశ తొలి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌పై 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. శుక్రవారం దుబాయ్ క్రికెట్ స్టేడియంలో తొలుత బంతితో కరీబియన్లను వణికించిన సఫారీలు.. ఆ తర్వాత బ్యాటుతో బాదేశారు. ఓపెనర్లు లారా వొల్వార్డ్త్ (59 నాటౌట్), తంజిమ్ బ్రిస్త్(57 నాటౌట్), అర్ధ శతకాలతో చెలరేగారు. మెగా టోర్నీలో అద్భుత రికార్డు కలిగిన విండీస్ బౌలర్లను ఉతికేస్తూ అజేయంగా జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఈ ఇద్దరి విధ్వంసంతో సఫారీలు వరల్ కప్లో అదిరే బోణీ కొట్టారు. మాజీ చాంపియన్ వెస్టిండీస్‌తో లీగ్ దశ తొలి మ్యాచ్. అయినా సరే దక్షిణాఫ్రికా కంగారు పడలేదు. మొదట బౌలింగ్ తీసుకొని హిట్టర్లతో నిండిన కరీబియన్ జట్టును తక్కువ స్కోర్కే కట్టడి చేసింది. అనంతరం 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సఫారీ జట్టు ఆడుతూ పాడుతూ ఛేదించింది. పవర్ ప్లేలోనే ఓపెనర్ తంజిమ్ బ్రిస్ట్(57 నాటౌట్), కెప్టెన్ లారా వొల్వార్డ్త్(59 నాటౌ ట్)లు మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు.

ఆ తర్వాత కూడా ఈ జోడీ జోరు తగ్గించలేదు. ఎడాపెడా బౌండరీలతో వెస్టిండీస్ బౌలర్ల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసింది. దాంతో, కరీబియన్ కెప్టెన్ హీలీ మాథ్యూస్ బౌలర్లను మర్చినా ఫలితం లేకపోయింది. ధనాధన్ ఇన్నింగ్స్‌తో విండీస్ను ఒత్తిడిలో పడేసిన లారా, బ్రిస్టు అజేయంగా జట్టును గెలిపించారు. 10 వికెట్ల విజయంతో దక్షిణాఫ్రికా రెండు పాయింట్లతో పాటు మంచి రన్ రేటు సొంతం చేసుకుంది.

### తిప్పేసిన లబా

టాస్ ఓడిన వెస్టిండీస్‌కు ఆదిలోనే షాక్. 15 పరుగులకే ఆల్రౌండర్ మరిజానే కాప్(2/14) ఓపెనర్ హేలీ మాథ్యూస్ (10)ను బోల్తా కొట్టించింది. ఆ తర్వాత బంతి అందుకున్న నొన్కులులెకో లబా(4/29) మరో ఓపెనర్ క్వియానా జోసెఫ్ (4)ను బౌల్ చేసి విండీస్ను ఒత్తిడిలో పడేసింది.

అయితే.. స్టఫానీ టేలర్(44), విధ్వంసక ఆల్రౌండర్ డియాంద్ర డాటిన్ (13)లు ధనాధన్ ఆడి జట్టును ఆదుకున్నారు. కానీ.. మరిజానే మరోసారి జట్టుకు బ్రేక్‌నిస్తూ డాటిన్ను వెనక్కి పంపింది. దాంతో.. 62 పరుగులకే విండీస్ సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో టేలర్, జైదా(15 నాటౌట్)లు బౌండరీలతో విరుచుకుపడి గౌరవప్రదమైన స్కోర్ అందించారు.

# బ్యాటర్ల సమిష్టి వైఫల్యం..

# తొలి పోరులో భారత్‌కు భారీ ఓటమి





మహిళల టీ20 వరల్డ్ కప్ తొలి పోరులోనే భారత జట్టుకు ఊహించని షాక్. పది రోజుల ప్రత్యేక క్యాంప్‌లో పక్కా సన్నద్ధతతో యూఏఈ వెళ్లిన టీమిండియా బ్యాటర్ల సమిష్టి వైఫల్యంతో భారీ ఓటమి మూటగట్టుకుంది. ఎన్నో ఆశలతో తొలి కప్ వేటను ఆరంభించిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి న్యూజిలాండ్ పెద్ద షాకిచ్చింది. మొదట బ్యాటుతో బాదేసి.. ఆ తర్వాత బంతితో చెలరేగిన కివీస్ భారత్‌ను లో స్కోర్‌కే కట్టడి చేసింది. ఓ పది.. ఇరవై పరుగుల తేడాతో కాదు.. ఏకంగా పరుగుల తేడాతో మర్చిపోలేని పరాజయం మూటగట్టుకుంది. టాప్ షోతో సూపర్ విక్టరీ కొట్టిన కివీస్ రెండు పాయింట్లతో పాటు మంచి రన్ రేటు సాధించింది.

దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ప్రత్యర్థికి కొండంత స్కోర్ చేసే అవకాశమిచ్చిన భారత జట్టు ఛేదనలో దారుణంగా తడబడింది. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. 8కి పైగా రన్ రేటుతో ఆడాల్సిన దశలో షాక్ డేంజరస్ ఓపెనర్ షఫాలీ వర్మ(2)ను ఈడెన్ కార్సన్ ఔట్ చేసింది. తన తొలి ఓవర్ మొదటి బంతికే రిటర్న్ క్యాచ్‌తో షఫాలీని ఆమె వెనక్కి పంపింది. 11 పరుగులకే తొలి వికెట్ పడిన దశలో మరో ఓపెనర్ స్మృతి మంధాన(12), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15)లు ఆచితూచి ఆడారు.

కానీ.. మంధాన వికెట్ సాధించిన కార్సన్ మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టింది. రన్‌రేటు అమాంతం పెరుగుతుండడంతో భారీ షాట్లకు దిగిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఎల్బీగా వెనుదిరిగింది. దాంతో.. టీమిండియా గెలుపు భారం మిడిలార్డర్, టెయిలెండర్లపై పడింది. కానీ, స్వల్ప వ్యవధిలోనే జెమీమా రోడ్రిగ్స్(13, రీచా ఘోష్(12), అరుంధతి రెడ్డి(1)లు కూడా ఔట్ కావడం తో భారత్ ఓటమి దాదాపు ఖాయమైంది. ఆఖరి వికెట్‌గా రేణుకా సింగ్ వెనుదిరగడంతో కివీస్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది. న్యూజిలాండ్ బౌలర్లలో రొస్మెరీ మెయిర్(419) అద్భుతంగా రాణించింది.

### సోఫీ సుడిగాలి ఇన్నింగ్స్

మొదట ఆడిన న్యూజిలాండ్ భారీ స్కోర్ కొట్టింది. కెప్టెన్ సోఫీ డెవినె (57 నాటౌట్) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడి జట్టుకు కొండంత స్కోర్ అందించింది. మొదట ఓపెనర్లు సుజీ బేట్స్(27), జార్జియా ప్లిమ్మర్(34)లు శుభారంభం ఇవ్వగా.. మిడిల్, డెత్ ఓవర్లలో సోఫీ రెచ్చిపోయింది. టీమిండియా ఫీల్డింగ్ వైఫల్యాన్ని సొమ్ము చేసుకున్న డెవినె బలమైన షాట్లతో విరుచుకుపడింది. బ్రూక్ హల్లిడే(16)లతో నాలుగో వికెట్‌కు 46 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. దాంతో, న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 160 పరుగులు చేసింది.

## మా దేశ క్రికెట్ ఐసీయూలో ఉంది

తమ దేశ క్రికెట్ ఐసీయూలో ఉందని, చికిత్స అందించడానికి స్పెషలిస్టులు కూడా లేరని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. పాక్ స్టార్ ప్లేయర్ బాబర్ అజామ్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న నేపథ్యంలో లతీఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్లో నాయకత్వ సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నాడు. ''ఇది నాయకత్వ సంక్షోభం. పాకిస్థాన్ క్రికెట్ ఐసీయూలో ఉంది. చికిత్స అందించడానికి నిపుణులు ఎవరూ లేరు. అసలు బాబర్ అజామ్ తిరిగి కెప్టెన్సీని తీసుకోవాల్సింది కాదు. జట్టు రాణించలేదు, అతను పెద్దగా పరుగులు చేయలేదు. అయితే కెప్టెన్సీకి రాజీనామా చేసిన నిర్ణయం ఆలస్యమైందని నా అభిప్రాయం. ఈ నిర్ణయం అతనిపై మాత్రమే కాదు, జట్టుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది'' అని రషీద్ లతీప్ అన్నాడు. సారథి బాధ్యతల నుంచి బాబార్ తప్పుకోవడం ఇది రెండో సారి. 2023 వన్డే వరల్ కప్ ముగిసిన అనంతరం జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. టీ20లకు బాబర్ అజామ్ స్థానంలో షాహిన్ అఫ్రిదిని కెప్టెన్‌గా నియమించారు. కానీ అఫ్రిదికి కేవలం న్యూజిలాండ్ సిరీస్ వరకే ఛాన్స్ ఇచ్చారు. టీ20 వరల్ కప్ ముంగిట తిరిగి వైట్ బాల్‌కు బాబార్‌ను తిరిగి కెప్టెన్గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నియమించింది. కానీ ఈ మెగాటోర్నీలో పాక్ ఘోర వైఫల్యాలను చవిచూసింది. అమెరికాతో చేతిలోనూ ఓటమిపాలై కనీసం గ్రూప్ స్టేజ్ను కూడా దాటలేకపోయింది. మరోవైపు కెప్టెన్సీ మార్పులపై పాకిస్థాన్ టీమ్లో ఐకమత్యం దెబ్బ తిందని సమాచారం.ఈ నేపథ్యంలో ఒత్తిడి మేరకు బాబర్ అజామ్ కెప్టెన్సీకి రాజీనామా చేశాడని ప్రచారం కూడా సాగుతోంది. బాబర్ స్థానంలో మహ్మద్ రిజ్వాన్ జట్టు పగ్గాలు అందుకునే అవకాశం ఉంది.

## 12న ఉప్పల్ స్టేడియంలో టీ-20 మ్యాచ్..

### పటిష్ట బందోబస్తు ఏర్పాటు



ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 12న ఇండియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగే టీ-20 క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో స్థానిక డీసీపీలు, ఏసీపీలతో పాటు జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక శాఖ, ఎలక్ట్రిసిటీ విభాగాలు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాలైన సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకుంటూ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవకాశమని, ఎన్ని సవాళ్లు ఎదురైనా తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. టిక్కెట్ల పంపిణీలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడాలని నిర్వహణ బృందానికి ఆయన సూచనలు చేశారు. ప్రేక్షకుల కోసం అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు, సాధారణ పౌరుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నకిలీ టిక్కెట్లను ఎవరైనా అమ్మితే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, టిక్కెట్ల పంపిణీ పూర్తిగా పారదర్శంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లు నమ్మవద్దని సీపీ సూచించారు. ఈ సమీక్షలో డీసీపీలు పద్మజ, కరుణాకర్, అరవింద్ బాబు, రమణారెడ్డి, ఉషా విశ్వనాథ్‌లతో పాటు హెచ్‌సీయు అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు దల్జీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.





దక్షిణాది చిత్ర పరిశ్రమనుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు నటి మాళవికా మోహనన్. హీరోలకు ఇచ్చినంత ప్రాధాన్యత నటీమణులకు ఇవ్వరన్నారు. 'యుద్రా' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ కామెంట్స్ చేశారు. సినిమా విజయం సాధిస్తే హీరోలకు భారీ కానుకలు అందిస్తారని.. కానీ హీరోయిన్స్‌కు మాత్రం అలా ఏమీ ఇవ్వరని, వారిని పెద్దగా గుర్తించరని తెలిపారు. ఇక ఏదైనా సినిమా పరాజయం పాలైతే హీరోయిన్ అన్‌లక్కీ అని.. ఆమె వల్లే సినిమా ఫ్లాప్ అయిందన్నట్లు చూస్తారని వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. కేరళకు చెందిన మాళవికా మోహనన్ 2013లో నటిగా కెరీర్ ఆరంభించారు. 'పట్టం పోల్' మూవీతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. అనంతరం, మలయాళం, కన్నడ, తమిళ చిత్రాల్లో యాక్ట్ చేశారు. ఆమె నటించిన 'తంగలాన్' ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా వచ్చిన 'యుద్రా'లో ఆమె నటించి హిందీలోనూ మంచి ఫేమ్ సొంతం చేసుకున్నారు. మాళవికా ప్రస్తుతం 'రాజా సాబ్' కోసం వర్క్ చేస్తున్నారు. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ఇదే ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ''రాజాసాబ్ రొమాంటిక్ కామెడీగా రానుంది. ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఇందులో భాగమైనం దుకు అదృష్టంగా భావిస్తున్నా. సినిమా చిత్రీకరణ కూడా చివరి దశలో ఉంది. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఇంటి భోజనం రుచికరంగా ఉంటుంది'' అని ఆమె తెలిపారు.

**ఫ్లాప్ అయితే హీరోయిన్‌నే తిడతారు**

## నా అభిమానులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా


ఎన్టీఆర్ కథానాయకుడిగా వచ్చిన దేవర చిత్రం బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇంతటి ఘనవిజయం సాధించిన సందర్భంగా చిత్రబృందం తాజాగా సక్సెస్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఇక ఈ వేడుకకు.. ముఖ్య అతిథులుగా.. ఎన్టీఆర్తో పాటు కొరటాల శివ, రాజమౌళి, అనిరుధ్ రవిచందర్, నందమూరి కళ్యాణ్ రామ్, దిల్ రాజు, ప్రకాశ్ రాజ్ తదితరులు హాజరయ్యారు. ఇక ఈ సక్సెస్ ఈవెంట్‌లో నటుడు ఎన్టీఆర్ మాట్లాడుతూ.. ఎంతో కోలాహలంగా, అట్టహాసంగా.. గ్రాండ్‌గా అభిమానులందరితో జరుపుకోవాలి ఈ సక్సెస్ ఈవెంట్‌ను కానీ.. కొన్ని అనివార్య కారణాల వలన.. దేవి నవరాత్రులు ఉండడం వలన సెక్యూరిటీ అనేది దృష్టిలో పెట్టుకుని అనుమతి రాలేదు. అందుకే ఇలా చిన్నగా ఈ వేడుకను దేవర టీంతో నిర్వహించాం. ముందుగా ఇంతటి భారీ సక్సెస్‌ను అందించినటువంటి ప్రేక్షక దేవుళ్లందరికి శిరస్సు వంచి




పాదాభివందనం చేసుకుంటున్నాను. టెంపర్, నాన్నకు ప్రేమతో, జనతా గ్యారేజ్, జై లవ కుశ, అరవింద సమేత వీర రాఘవ, ఆర్‌ఆర్‌ఆర్.. ఇప్పుడు దేవర. ఈ ఏడు చిత్రాల విజయం వెనక నా దర్శకులతో పాటు సంకేతిక నిపుణులతో పాటు నా తల్లిదండ్రుల ఆశీస్సులతో పాటు అన్నిటికంటే ముఖ్యమైనది మా అభిమానులు. ఏ జన్మలో చేసుకున్న రుణమో.. ఈ జన్మలో కలిసి ఒక గర్భంలో పుట్టకపోయిన.. కలిసి రక్తాన్ని పంచుకోకపోయిన.. రక్త సంబంధం కంటే కూడా రుణపడిపోయో అనుభందం ఏర్పడింది మీ అందరితో. ఎప్పుడు నా వెన్నంటే ఉండి.. నాకోసం పోరాడుతూ.. ఎల్లప్పుడూ మీ ఆశీస్సులను అందజేస్తున్నందుకు శిరస్సు వంచి పాదాభివందనం చేసుకుంటున్నాను అంటూ తారక్ ఎమోషనల్ అయ్యాడు. ఈ జన్మలో కాకపోయిన వచ్చే జన్మలో అయిన మీ రుణం తీర్చుకుంటాను. అప్పటివరకు వడ్డిని లెక్కవేస్తుంటాను. ఈ సినిమా ఇంతటి ఘనవిజయం సాధించిడానికి కారణం దేవర టీం. ఈ సినిమాకోసం కష్టపడ్డా ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు అంటూ చెప్పుకొచ్చాడు.

## జాన్వీ నటన అద్భుతం..

కమర్షియల్ సినిమాలు చేయడం సులభం కాదన్నారు నటి అనన్యపాండే. తన తాజా చిత్రం 'కంట్రోల్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియాతో మాట్లాడుతూ ఆమె జాన్వీకపూర్ నటించిన 'దేవర' పస్తావన తెచ్చారు. 'దేవర'లో జాన్వీ పాత్ర నిడివి తక్కువ ఉందని కొందరు విమర్శించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో అనన్య దీని గురించి మాట్లాడారు. ''కమర్షియల్ సినిమాల్లో నటించడం సులభమని ప్రేక్షకులు భావిస్తారు. కానీ, అలాంటి సినిమాల్లో నటించడం అనేది ఒక కళ. జాన్వీ ఇటీవల వచ్చిన 'దేవర'లో అద్భుతంగా నటించారు.



ప్రత్యేకించి 'చుట్టమల్లే..' సాంగ్‌లోఆమె హావభావాలు చాలా బాగున్నాయి. ఒకే సమయంలో డ్యాన్స్‌లో అన్ని ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడం కష్టం'' అని ప్రశంసించారు. ఇక తన కెరీర్ గురించి అనన్య మాట్లాడుతూ.. ''కంట్రోల్‌లో కొత్తగా ప్రయత్నించాను. యాక్షన్ చిత్రాలతో పాటు హరర్ సినిమాల్లోనూ నటించాలనుంది. స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు నేను ప్రేక్షకుడి కోణం నుంచి ఆలోచిస్తాను. దాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మినప్పుడే అంగీకరిస్తాను. నటీనటులు కొత్తగా ప్రయత్నిస్తేనే ఎదుగుదల ఉంటుంది. ప్రస్తుతం హాలీవుడ్ తరహా చిత్రాలు ఇక్కడ కూడా రూపొందుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పారు.

## అమ్మవారి సేవలో సమంత



సమంత రూత్ ప్రభు తన ఆరోగ్య సమస్య కారణంగా కొంతకాలం సినిమా లకు మరియు షూటింగ్‌లకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో యోగా, ధ్యానంతో పాటు చికిత్స పొంద డంలో బిజీగా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ సమంత విడాకుల వార్తల్లో నిలిచింది. తెలుగు స్టార్ కపుల్ అక్కినేని నాగ చైతన్య, సమంత రూత్ ప్రభుల విడా కుల వెనుక కేటీఆర్ హస్తం ఉందని తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణ తీవ్ర సంచలనం సృష్టిం చగా, దానికి సమంత బదులివ్వగా, ఆ తర్వాత సురేఖ క్షమాపణలు చెప్పింది. ఇదంతా వార్తల్లో ఉండగానే సమంత మళ్లీ ఇషా ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. ఇషా ఫౌండేషన్‌కి వెళ్లిన సమంత అక్కడ లింగభైరవి దేవిని దర్శించుకుంది. దీనికి సంబంధించిన ఫోటోలను కూడా నటి తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. లింగభైరవి వద మొకరిల్లిన ఫోటోను సమంత షేర్ చేసింది. ధన్యవాదాలు దేవీ! అని కామెంట్ చేసిన ఆమె అందరికీ నవరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidu pet, Guntur (District), AP-522002. **EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.**